V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

బుధవారం
05-02-2025

సంపుటి : 01 | సంచిక : 274 | పేజీలు : 13 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ CMD

## మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను
# నెరవేరుస్తాం

### వికసిత్ భారత్ సాధనే మా ప్రభుత్వ లక్ష్యం

- కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారు
- మేం మాత్రం ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వడంపై దృష్టి పెట్టాం
- దేశంలో పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించాం
- ''ప్రజల సొమ్ము ప్రజల చేతికే'' అనేది మా నినాదం
- డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం
- రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించిన ప్రధాని మోడీ




**ఢిల్లీ:** గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని ప్రధాని మోడీ తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మోడీ ప్రసంగించారు. ''రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం నింపింది. మరోసారి మా ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు. వికసిత్ భారత్ సాధనే మా ప్రభుత్వ లక్ష్యం. మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం. గత ప్రభుత్వాలు గరీబీ హటావో అని నినాదాలు మాత్రమే చేశాయి. మిగతా2లో...

# బీఆర్ఎస్ పార్టీ విప్‌ల నియామకం

- శాసనమండలికి సత్యవతి రాథోడ్, శాసనసభకు కేపీ వివేకానంద్ గౌడ్
- నియామకపత్రాలు అందజేసిన కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని చట్టసభల్లో బీఆర్ఎస్ పార్టీ విప్‌లుగా సత్యవతి రాథోడ్, కేపీ వివేకానంద్ గౌడ్ నియమితులయ్యారు. శాసన మండలిలో పార్టీ విప్‌గా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను, శాసన సభలో పార్టీ విప్‌గా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్‌ను నియమించారు.బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్.. సత్యవతి రాథోడ్, కేపీ వివేకానంద్ గౌడ్‌లకు విప్ పదవులు కట్టబెట్టాలని నిర్ణయించారు. అధినేత మిగతా2లో...



## బీసీలకు మేం 42 శాతం
# రిజర్వేషన్లు కల్పిస్తాం

### అన్ని పార్టీలు ఈ ప్రకారం సీట్లు ఇవ్వాలి

- కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం
- సర్వే 50 రోజులు జరిగితే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు
- భూముల వివరాలు అడగ్గానే వారు భయపడి సర్వేలో పాల్గొనలేదు
- గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదు?
- ఫిబ్రవరి 4.. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుంటుంది..
- కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. బీఆర్ఎస్ నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. ''కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ సర్వేలో మిగతా2లో...

దేశంలో బలహీనవర్గాలకు సంబంధించి ఇప్పటి వరకు సహేతుకమైన సమాచారం లేదు.. దీంతో రిజర్వేషన్లు అమలు చేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితి ఉంది.. 1931 తరువాత భారతదేశంలో ఇప్పటి వరకు బలహీన వర్గాల సంఖ్య ఎంతో తేల్చలేదు.. జనాభా లెక్కల్లోనూ బలహీనవర్గాల లెక్కలు పొందుపరచలేదు.. అందుకే భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన చేస్తామని మాట ఇచ్చారు.. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేశాం.. కులగణన ప్రక్రియను పూర్తి చేసి ఇవాళ నివేదికను సభలో ప్రవేశపెట్టామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు.

# తిరుమలలో కిటకిటలాడిన మాడ వీధులు

ఏడు వాహనాల్లో మలయప్ప స్వామి దర్శనం



రథసప్తమి సందర్భంగా తిరుమలలోని మాడ వీధులు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం రథ సప్తమి పురస్కరించుకుని స్వామివారు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాల్లో భక్తులను కటాక్షించనున్నారు.

# ఉత్తమ్ చెప్పిన వివరాలనే భట్టి చెప్పారు

బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అనడం లేదు

శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత



# వివరణ ఇవ్వండి

### కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు

లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని కోరిన శాసనసభ కార్యదర్శి

వివరణ ఇచ్చేందుకు తమకు సమయం కావాలని కోరిన పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు



**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు తాఖీదులు అందాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలంటూ అందులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ వేసిన అనర్హత పిటిషన్ ఆధారంగా శాసనసభ కార్యదర్శి నరసింహా చార్యులు మంగళవారం నోటీసులు మిగతా2లో...

## నేడే ఢిల్లీ అసెంబ్లీ
# ఎన్నికలు

- సర్వం సిద్ధం చేసిన ఈసీ
- 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్







# ఎస్సీ వర్గీకరణకు శాసన మండలి ఆమోదం

### 3 గ్రూపులుగా ఎస్సీలను వర్గీకరించాలని కమిషన్ సిఫారసు

ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక సారాంశంపై ప్రభుత్వం ప్రకటన

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 103 | ₹ 125 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 181 | ₹ 206 |

## అంతేగా!



## చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ
# అగ్ని ప్రమాదం

- ఒక్కసారిగా ఎగసిపడిన మంటలు
- చుట్టుపక్కల పరిశ్రమలకు వ్యాపించడంతో తీవ్ర భయాందోళనకు గురైన స్థానికులు





# ఇండ్లను కూల్చేందుకు సిద్ధమైన అధికారులు

- చారకొండలో తీవ్ర ఉద్రిక్తత
- బైపాస్ రోడ్డు కోసం మా ఇండ్లు కూలగొట్టొద్దు
- నిరసన వ్యక్తం చేసిన బాధిత కుటుంబాలు

**విశ్వంభర, నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. జడ్చర్ల-కోదాడ 167 వ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా బైపాస్ మిగతా2లో...

# ఉపాధి హామీ పథకంలో రెండేళ్లలో 1.55కోట్ల మంది తొలగింపు

లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్



**ఢిల్లీ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న వారిలో 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో మిగతా2లో...

## వివరణ ఇవ్వండి..

**మొదటిపేజీ తరువాయి**
పంపించారు. అయితే వివరణ ఇచ్చేందుకు తమకు సమయం కావాలంటూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కోరారు. 2024 మేలో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దానం నాగేందర్, కడియం శ్రీహరి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. అయితే స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయనకు తగిన ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులను బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించారు. ఇటీవలే బీఆర్ఎస్ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు.. తగిన సమయం అంటే ఎంత అంటూ ప్రశ్నించింది. నిర్దిష్ట సమయం చెప్పాలంటూ శాసనసభ కార్యదర్శిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సెక్రెటరీ నరసింహా చార్యులు నోటీసులు ఇచ్చారు.బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఏడుగురు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీచేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం సంజయ్‌కుమార్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అనంతరం ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేసింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని గతంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను, తాజాగా కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొన్నది. ఈ పిటిషన్లను తెలంగాణ స్పీకర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీకి అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

### బీఆర్ఎస్ పార్టీ విప్‌ల నియామకం

**మొదటిపేజీ తరువాయి**
నిర్ణయం మేరకు పార్టీ వారిని విప్‌లుగా నియమించింది. అనంతరం వారు తమ నియమాక పత్రాలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి వెళ్లి స్పీకర్‌కు అందజేశారు.

## తిరుమలలో కిటకిటలాడిన మాడ వీధులు..

**విశ్వంభర, తిరుమల:** రథసప్తమి సందర్భంగా తిరుమలలోని మాడ వీధులు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం రథ సప్తమి పురస్కరించుకుని స్వామివారు ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాల్లో భక్తులను కటాక్షించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు జరిగిన వాహన సేవలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకు సూర్యప్రభ వాహనం, చిన్నశేష వాహనం, గరుడ వాహనంపై మలయప్పస్వామి ఊరేగారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని అర్చకులు వివరించారు.సూర్యప్రభ వాహనంపై సూర్య నారాయణమూర్తిని వీక్షించిన భక్తులు అనంతరం స్వామివారి చిద్విలాసాన్ని చిన్నశేష వాహనంపై తిలకించి పులకరించిపోయారు. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని భక్తుల నమ్మకమని అర్చకులు వివరించారు.ఈ కార్యక్రమంలో ఈవో జె శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి వీరబ్రహ్మం, పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మీ, నన్నపనేని సదాశివరావు, జి.భానుప్రకాష్ రెడ్డి, అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు శాసన మండలి ఆమోదం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణపై కమిషన్ సారాంశంపై ప్రభుత్వం ప్రకటన చేసింది. అందులో 3 గ్రూపులుగా ఎస్సీలను వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది. అలాగే ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిన కొద్దిసేపటికే శాసనమండలి వాయిదా పడింది. ఇదిలా ఉంటే.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా.. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ తో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ సోమవారం మధ్యాహ్నం కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి నివేదికను అందజేసింది. అనంతరం సభ్యులతో దీనిపై చర్చించి మంగళవారం ఉదయం ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదికకు ఆమోదం తెలిపారు. అనంతరం దాన్ని తెలంగాణ శాసన మండలిలో ప్రవేశ పెట్టగా ఎస్సీ వర్గీకరణకు తెలంగాణ శాసన మండలి ఆమోదం తెలిపింది. అయితే ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ మందకృష్ణ మాదిగ సుదీర్ఘకాలం పాటు చేసిన పోరాటానికి ఫలితంగా. ఆగస్టు 1, 2024న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పుతో తెలంగాణలో మొదటగా ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా.. 11, 2024న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్‌ను ఏకసభ్య కమిషన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు నెలల్లో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించింది.

## ఉపాధి హామీ పథకంలో రెండేళ్లలో 1.55కోట్ల మంది తొలగింపు

**మొదటిపేజీ తరువాయి**
ఈ విషయాన్ని వెల్లడించారు.2022-23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు.

## ఇండ్లను కూల్చేందుకు సిద్ధమైన అధికారులు..

**మొదటిపేజీ తరువాయి**
రోడ్డు కోసం చారకొండలో 29 ఇండ్లను కూలగొట్టడానికి అధికారులు సిద్ధమయ్యారు. అధికారులు పోలీసు బలగాలు, జేసీబీలతో చేరుకోవడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. బైపాస్ రోడ్డు కోసం మా ఇండ్లు కూలగొట్టొద్దు అని బాధిత కుటుంబాలు నిరసన వ్యక్తం చేశాయి. కండ్లముందే తమ ఇల్లు కూల్చివేస్తుండడంతో వృద్ధ దంపతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఓ వృద్ధురాలు సోమసిల్లి పడిపోయింది. చిన్న పాపను సైతం పోలీసు వాహనాల్లో తరలిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


# బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం

**మొదటిపేజీ తరువాయి**
పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు'' అని అన్నారు.

**గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదు?**
''గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు భయటపెట్టలేదు? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదు'' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

ఫిబ్రవరి 4.. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుంటుంది..

హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కోసం



ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు.''వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. నేరుగా ప్రజలను కలుసుకుని విజ్ఞప్తులు సేకరించింది. మరికొందరు కమిషన్‌కు ఆన్‌లైన్ ద్వారా విజ్ఞప్తులు అందించారు. 82 రోజుల్లో కమిషన్ తన నివేదికను అందించింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను గ్రూప్-1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది. గ్రూప్-1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్-2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్-3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఎస్సీ కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ వర్గీకరణ, కులగణన.. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు. ఫిబ్రవరి 4, 2025.. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుంది. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా'' అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలగదు..

30, 40 ఏళ్ల నాటి ఆకాంక్ష నేడు సాకారం అవుతోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ''ఎస్సీ వర్గీకరణ వల్ల కొందరిలో భయం, అభద్రతాభావం కలుగుతోంది. వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలగదు.అంటరానితనం అనేది ప్రపంచం అంతటా ఉంది. ఎంత చదువుకున్నా.. ఎంత ఎదిగినా.. ఎక్కడో ఒకచోట వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుంది. గాంధీజీ, అంబేద్కర్ వంటి మహనీయులకు కూడా వివక్ష తప్పలేదు. సామాజిక న్యాయం ఎక్కువగా కల్పించింది కాంగ్రెస్ పార్టీయే. 50 ఏళ్ల క్రితమే దళితనేత దామోదరం సంజీవయ్యను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంను చేసింది కాంగ్రెస్ పార్టీ. జగ్జీవన్‌రామ్, దామోదరం సంజీవయ్య వంటి వారికి ఉన్నత పదవులు ఇచ్చింది. సామాజిక ఫలాలు అందరికీ అందాలనేది కాంగ్రెస్ పార్టీ తపన. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం రాజకీయ కారణాలతో తీసుకోలేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి తీసుకున్న నిర్ణయం ఇది. ప్రభుత్వానికి సంబంధం లేకుడా కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఉంటుందని ఏఐసీసీ ఎప్పుడో చెప్పింది'' అని పేర్కొన్నారు.

## మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం

**మొదటిపేజీ తరువాయి**
కొందరు నేతలు బంగ్లాలు కట్టుకోవడంపై దృష్టిసారించారు. మేం మాత్రం ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇవ్వడంపై దృష్టి పెట్టాం. దేశంలో పేదల కోసం 12 కోట్లకుపైగా మరుగుదొడ్లు కట్టించాం. ''కొందరు నేతలు పేదల గుడిసెల వద్ద వారితో ఫొటోలు దిగేందుకే ఉత్సాహం చూపిస్తారు. సభలో పేదల గురించి మాట్లాడితే.. ఫొటోలకు ఫోజులిచ్చిన నేతలు మొహం విసుగ్గా పెడతారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే.. గ్రామాలకు 16పైసలే చేరుతోందని గతంలో ఓ ప్రధాని వాపోయారు. అప్పట్లో ఢిల్లీ నుంచి గల్లీ వరకూ ఒకే ప్రభుత్వం ఉన్నా అదే పరిస్థితి ఉండేది. కానీ, ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోంది. నగదు బదిలీ ద్వారా నేరుగా ప్రజలకే ఇప్పుడు సొమ్ము అందుతోంది''

**పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం..**
''ప్రజల సొమ్ము ప్రజల చేతికే'' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో



తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. కొందరు శీష్ మహల్ నిర్మాణం కోసం అవినీతి చేస్తారు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగింది''

''మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం''అని ప్రధాని వివరించారు.

### ఐదు రోజులూ ఆఫీసు నుంచి పని చేయాల్సిందే..
## ఉద్యోగులకు డెల్ సమాచారం

**ముంబయి:** టెక్ కంపెనీలన్నీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి స్వస్తి పలుకుతున్నాయి. ఇప్పటికే చాలా సంస్థలు తమ ఉద్యోగులంతా ఆఫీసుకు రావాలని అల్టిమేటం జారీ చేశాయి. తాజాగా ప్రముఖ కంప్యూటర్ల తయారీ సంస్థ డెల్ కూడా హైబ్రిడ్, రిమోట్ వర్క్ పాలసీకి స్వస్తి చెబుతున్నట్లు పేర్కొంది. ఈవిషయాన్ని కంపెనీ సీఈఓ మైఖేల్ డెల్ ఇ-మెయిల్ ద్వారా ఉద్యోగులకు సమాచారం అందజేసినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

డెల్ కార్యాలయాల దగ్గర నివసించే ఉద్యోగులు ఇకపై హైబ్రిడ్, రిమోట్ వర్క్ విధానంలో పని చేయడానికి వీలుండదని మైఖేల్ డెల్ ఉద్యోగులకు పంపిన ఇ-మెయిల్‌లో తెలిపారు. వారంలో ఐదు రోజులు తప్పనిసరిగా ఆఫీస్ నుంచి పని చేయాలని తెలియజేశారు. మార్చి 3 నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే కార్యాలయం సమీపంలో నివసిస్తున్న ఉద్యోగులకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలుస్తోంది. సుదూర ప్రాంతాల్లో నివసించే ఉద్యోగులు రిమోట్‌గా పని చేసేందుకు సీనియర్ లీడర్ల నుంచి తగిన కారణాలు చూపించి తప్పనిసరిగా అనుమతి పొందాల్సి ఉంటుంది. లేదంటే వారెవరికీ పదోన్నతులు ఉండవని తెలుస్తోంది. భవిష్యత్తులో నియమించుకొనే వారికి ఇకపై రిమోట్ విధానం ఉండదని అందులో పేర్కొంది. కరోనాకు ముందునుంచే డెల్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం అమల్లో ఉండేది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ మైఖేల్ డెల్ సైతం దీన్ని ప్రోత్సహించేవారు. పైగా ఆఫీసుకు రావాలని ఆదేశిస్తున్న కంపెనీలను ఆయన తప్పుబట్టారు. కానీ, తాజాగా డెల్ విధానాల్లో సమూల మార్పులు వచ్చాయి. అందరూ కలిసి పనిచేయడం, తమ ఆలోచనలను పంచుకోవడం సంస్థ వృద్ధికి దోహదం చేస్తుందని కంపెనీ భావిస్తోంది. ఈనేపథ్యంలోనే ప్రతిఒక్కరూ ఆఫీసుకు రావాలని కోరుతోంది. గతేడాది సెప్టెంబర్‌లోనే కంపెనీ తన గ్లోబల్ సేల్స్ బృందానికి తప్పనిసరిగా ఐదు రోజులు ఆఫీసుకు వచ్చి పనిచేయాల్సిందిగా తెలిపింది. ల్యాబ్ ఇంజినీర్లు, ఆన్-సైట్ సిబ్బంది, లీడర్లు ఇలా ప్రతిఒక్కరూ కార్యాలయానికి రావాలని కోరింది. తాజాగా ఈ నిబంధనల్ని ప్రతి విభాగంలోనూ అమలుచేస్తోంది.




## కులగణన క్రెడిట్ ఆ ఇద్దరిదే.. మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు

**విశ్వంభర, హైదరాబాద్:** కులగణనపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కులగణన క్రెడిట్ మొత్తం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కదే అన్నారు. సర్వే రిపోర్ట్‌ను అందరికీ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు ఈ సర్వే చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. బీఆర్ఎస్ సర్వేలో ముస్లిం బీసీలు కలిసి 51 ఉంటే.. తమ సర్వేలో 56 శాతంగా వచ్చిందని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ అసెంబ్లీలో కులగణన నివేదికను ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన నివేదికపై బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభాను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని కులగణన సర్వే నివేదికపై ప్రజల్లో అనుమానాలు వస్తున్నాయని ఆరోపించారు. ఈ ఆరోపణలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఏదైనా బీజేపీ ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో బీసీల గణన మొదలుపెట్టారా అని ప్రశ్నించారు. ఇదొక చారిత్రాత్మక మార్పు అని అన్నారు. సామాజిక మార్పు కోసం రాహుల్ గాంధీ ద్వారా మొదలుపెట్టామని అన్నారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీల విషయంలో కాంగ్రెస్పార్టీ నిబద్ధతతో ఉందని తెలిపారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామన్నారు. లక్షా 3వేల మంది ప్రభుత్వ



సిబ్బందితో కులగణన సర్వే చేయించామని చెప్పారు.

## ఉత్తమ్ చెప్పిన వివరాలనే భట్టి చెప్పారు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన నివేదికపై అసెంబ్లీ , శాసనమండలి లో చర్చ పెట్టారు. ఈ క్రమంలో శాసనమండలిలో కేబినెట్ ఆమోదం తెలిపిన కులగణన నివేదిక రిపోర్టు ను మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చదివి వినిపించారు. అంతకు ముందు ప్రభుత్వ తీరుపై మండలి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. అయితే ఎమ్మెల్సీ కవిత, మదుసుదనా చారి మాత్రం సభలోనే కొనసాగారు. అనంతరం భట్టి విక్రమార్క స్పీచ్ పై ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు రోజుల కిందట.. చెప్పిన కులగణన వివరాలనే ఇప్పుడు శాసనమండలిలో భట్టి విక్రమార్క చెప్పి మమ అనిపించారని ఆరోపించారు. అలాగే ఈ కులగణన వివరాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాగా కవిత వ్యాఖ్యలతో మండలిలో ఒక్కసారిగా దుమారం రేపింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. కులగణన సర్వే నివేదిక ద్వారా.. తాము రాష్ట్ర ప్రజల రిపోర్టును తీసుకున్నామని.. దీనిని బేస్ చేసుకొని.. ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, దీని ఆదారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతెలిపారు.

## చర్లపల్లి పారిశ్రామికవాడలో భారీ అగ్ని ప్రమాదం



**విశ్వంభర, చర్లపల్లి:** చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సర్వోదయ సాల్వెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మంగళవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా ఎగసిపడిన మంటలు చుట్టుపక్కల పరిశ్రమలకు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న మహాలక్ష్మి రబ్బర్ కంపెనీ, శేషసాయి రసాయన పరిశ్రమలకు మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారు. భారీగా ఎగసిపడిన మంటల ధాటికి సర్వోదయ సాల్వెంట్ పరిశ్రమ భవనం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 20వేల లీటర్ల రసాయనాలు ఉన్నట్టు తెలుస్తోంది. దాంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని చెబుతున్నారు. రసాయనాల ఘాటుతో స్థానికులు ఉక్కిరి బిక్కిరయ్యారు. 10 అగ్నిమాపక శకటాలతో మంటలు అదుపు చేసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో సర్వోదయ కంపెనీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

## నేడే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు..

**ఢిల్లీ:** ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు.ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న (PWD) వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది.

## కులగణనపై అసెంబ్లీలో తీర్మానం.. గాంధీ భవన్‌లో సంబురాలు



**విశ్వంభర, హైదరాబాద్:** బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల కాంగ్రెస్‌లో హర్షాతిరేకలు వెల్లివిరిశాయి. ఈ మేరకు మంగళవారం గాంధీ భవన్‌లో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పులతో నాయకులు, కార్యకర్తలు బాణ సంచా కాల్చారు. ఆపై స్వీట్లు పంచుకొని వేడుకలు చేసుకున్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ వెంకట్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఓబీసీ చైర్మన్ నూతి శ్రీకాంత్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, మాజీ మంత్రులు చంద్రశేఖర్, పుష్పలీల, ఏపూరి సోమన్న, నమిల్ల శ్రీనివాస్, సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మార్క్: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

కాంగ్రెస్‌మార్క్‌విజయానికి కులగణన, ఎస్సీ వర్గీకరణ నిదర్శనంగా నిలుస్తాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీలో కులగణనపై అసెంబ్లీలో తీర్మానంపై సీఎం రేవంత్, మంత్రుల బృందానికి టీపీసీసీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్ట్‌లో పొందుపరిచిన విధంగా కులగణన, ఎస్సీ వర్గీకరణకు చర్యలు చేపట్టిందన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ సాహసోపేతమైన నిర్ణయాలు అని స్పష్టం చేశారు. తెలంగాణ చరిత్రలో గొప్ప అధ్యాయాలు కులగణన, ఎస్సీ వర్గీకరణ నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కులగణన సర్వే చేపట్టి పూర్తి చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది, అనడానికి కులగణన, ఎస్సీ వర్గీకరణ నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు అవకులు, చెవాకులు పేల్చడం మానుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీల కోసం పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందేమిటో? కవిత, కేటీఆర్, హరీష్ రావు సమాధానం చెప్పాలని పీసీసీ ఛీఫ్‌ప్రశ్నించారు.

## కోరిన వెంటనే స్పీకర్ సభను వాయిదా వేయడమా?: మాజీ మంత్రి తలసాని



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ న్యాయం కోసం ఎదురుచూస్తోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శాసనసభను ప్రారంభమైన వెంటనే వాయిదా వేయడాన్ని ఆయన ఖండించారు. నాలుగు రోజుల పాటు చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ''కామారెడ్డి డిక్లరేషన్‌ను యథాతథంగా అమలు చేయడం కోసం మన సమాజం ఎదురు చూస్తోంది. శాసనసభ వ్యవహారాల మంత్రి అడిగిన వెంటనే స్పీకర్ సభను వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రాధాన్యత గల అంశాలపై నాలుగు రోజులు చర్చ లేకుండా ఒక్క రోజులోనే ముగించడమేంటి? బాధ్యతా రహితంగా, అన్యాయంగా, కుట్ర పూరితంగా వ్యవహరించడాన్ని మేం సహించం. ఇప్పటికైనా నాలుగు రోజుల పాటు చర్చలు జరగాలి. కులగణన తప్పు అంటున్నాం.. అదెలా కరెక్ట్ అవుతుందో నిరూపించుకోవాలి. సర్వేలో మాకు అనుమానాలున్నాయి. అవి నివృత్తి కావాలి. అన్యాయం జరిగితే.. బీసీల ఐక్యతతో అతిపెద్ద ఉద్యమం వస్తుంది'' అని పేర్కొన్నారు.

## భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలకు కుల గణన సర్వే రోడ్‌మ్యాప్‌లాంటిది - మంత్రి పొన్నం ప్రభాకర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలకు కుల గణన సర్వే రోడ్‌మ్యాప్‌లాంటిది మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సభలో కుల గణన సర్వే నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా చర్చ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడారు. 1931 సరైన నివేదికలు లేవన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే నివేదిక ఇవాళ అసెంబ్లీకి వచ్చిందన్నారు. సమాచారానికి సంబంధించి ఇంకా ఏమైనా సర్వే చేయాల్సి ఉంటే.. ఇంకా బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సభ్యులను కోరారు.

ప్రతీది రాజకీయం చేయొదని.. ఇది బలహీన వర్గాల ఆకాంక్ష అని పేర్కొన్నారు. తెలంగాణ బలహీన వర్గాల నాయకత్వం ప్రతీ జిల్లాల్లో ఇవాళ స్వేచ్ఛగా.. ఆకాంక్షను సంఘాలు, మేధాలు వెలిబుచ్చాల్సిన అవసరం ఉందన్నారు. చాలాకాలంగా కుల గణన కోసం డిమాండ్ చేస్తున్న వారి ఆకాంక్ష నెరవేరిందన్నారు. జనాభా సమాచారాన్ని తీసుకొని భవిష్యత్‌లో ఆయా వర్గాలకు ఎలాంటి న్యాయం చేయాలో చేస్తామన్నారు. బలహీన వర్గాల శకం నేటి నుంచి ప్రారంభమైందన్నారు. భవిష్యత్‌లో వారి అభ్యున్నతి కోసం పాటుపడుతామన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన నివేదిక ఈ దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు.బలహీన వర్గాల తరపున గొంతెత్తి.. వారికి న్యాయం చేయాలని చెప్పే ప్రతి రాజకీయ పార్టీ స్వాగతించి.. భవిష్యత్ ప్రణాళికలకు సలహాలు ఇచ్చి దీన్ని ముందుకు తీసుకుపోవాలని కోరారు. నివేదికపై చర్చించి సూచనలు ఇచ్చి రోడ్‌మ్యాప్‌ను నిర్ణయిస్తే.. భవిష్యత్‌లో అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామన్నారు. భావి తరాలకు న్యాయం చేయడానికి సమగ్ర వివరాల సేకరణ జరిగిందని.. బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉందన్నారు.

### అసెంబ్లీలో 42శాతం రిజర్వేషన్లు

# బిల్లు పెడుతరేమో అనుకున్నం : కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే.. 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడుతున్నరేమో అనుకున్నామని.. చివరకు ఏదో సర్వే రిపోర్ట్‌ని పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. అసెంబ్లీలో బీసీ కుల గణన నివేదికపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో కామారెడ్డి డిక్లరేషన్ తరహాలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి బిల్లు ప్రవేశపెడతారేమోనని.. ఆ బిల్లును శాసనసభలో ఆమోదింప చేసి.. చట్టబద్ధత కల్పిస్తారేమోనని రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి లేచి నాలుగు పేర్లు చదువుతున్నారు. మీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. ఎందుకంటే రేవంత్‌రెడ్డి గారు మీరే చెప్పారు' అంటూ విమర్శించారు.

రేవంత్ ప్రసంగం యూట్యూబ్‌లో ఉంది..

'సమగ్ర కుటుంబ సర్వే జరిగినప్పుడు.. తమరిచ్చిన ఉపన్యాసం యూట్యూబ్‌లలో, అన్ని టీవీల్లో ఉంది. ఆ రోజు ఏమన్నరు ? ఆ ముఖ్యమంత్రి సర్వే పెడితే ఎవరు పడితే వాళ్లు మీ ఇంటికి వచ్చే వివరాలు అడిగితే ఇచ్చేస్తారా..? అని మాట్లాడిందే రేవంత్‌రెడ్డి. మీరు చెప్పిన మాటలనే ఎన్యుమరేటర్లకు చూపించి వివరాలు ఇవ్వమని చెప్పారు. 57 రకాల వివరాలు అడుగుతున్నరు.. ఎట్లిస్తం ? అని మీరే అన్నరు. ఎవరు పడితే వారికి ఇచ్చేస్తామా? అన్నరు. అదే చూపించి ప్రజలు అడిగారు. వాస్తవం ఏంటంటే.. సమగ్ర కుటుంబ సర్వే 2014లో జరిగింది. శాంతికుమారి, రామకృష్ణారావు, సందీప్‌కుమార్ సుల్తానియా ఉన్నారు. అప్పుడు ఉన్నది ఇదే అధికారులు.. వేరే ఎవరో లేరు. రికార్డు ప్రకారం మాట్లాడుతున్నాను. సమగ్ర కుటుంబ సర్వేను చేయించింది ప్రభుత్వమే.. చేసింది ప్రభుత్వ అధికారులే. అది ఖచ్చితంగా అఫీషియల్ డాక్యుమెంట్. అందులో ఖచ్చితంగా ఓపెన్‌గా వెబ్‌సైట్‌లోనే పెట్టాం' అన్నారు.

బీసీల జనాభా సంఖ్య సమగ్ర సర్వేలో ఉంది..

'అసెంబ్లీలో కాదు.. చాటుమాటుగా కాదు.. పారదర్శకంగా వెబ్‌సైట్‌లో పెట్టాం. అదే పాయల్ శంకర్ వివరాలు తీసుకున్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో ఏం ఉన్నది. కేసీఆర్ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏంటంటే.. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న కుటుంబాల సంఖ్య కోటి మూడు లక్షల 95వేల కుటుంబాలు. పాల్గొన్న ప్రజలు 3.68కోట్లు. 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటిని ఎన్యుమరేట్ చేశాం. ముఖ్యమంత్రి ఎంత తప్పుదోవ పట్టిస్తున్నారంటే.. ఇంతకు మించి టాపిక్ లేదు. మా ప్రభుత్వం గతంలో చేసిన పని గురించి.. అనుమానాలు తలెత్తే విధంగా మాట్లాడరో దాని గురించి చెప్పాల్సిన అవసరం ఉంది. సీఎం బీసీల సంఖ్య అందులో ఎంత? అని అడుగుతున్నారు. ఆ నాడు బీసీల సంఖ్య సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 1,85,61,856గా ఉంది. 51శాతం బీసీలు.. అది కాకుండా ముస్లిం సామాజిక వర్గంలో ఉండే బీసీలను 10శాతం కలుపుకుంటే.. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 61శాతం ఉండేది. శ్రీనివాస్ యాదవ్ సరిగ్గా చెప్పారు' అన్నారు.

నివేదికను తగలబెట్టాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ చెబుతున్నడు..

'ఈ నివేదిక అంతా తప్పుల తడక అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తగలబెట్టాలని చెబుతున్నడు. రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల సంఘాలు చెబుతున్నయ్. సమగ్ర కుటుంబ సర్వేలో 1.85కోట్లు ఉన్న బీసీలు ఎట్లా 1.64లక్షలకు తగ్గారు.. 51శాతం 46శాతం ఎట్లయ్యిందని అడుగుతున్నరు. శంకర్ అన్న కూడా అదే అడిగిండు.. అందులో తప్పు ఏముంది. ఆయనే కాదు.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మాట్లాడుతున్నడు. మీరిచ్చిన నివేదికను తగలబెట్టాలని చెబుతున్నడు. శాసనసభ సమావేశం ప్రత్యేకంగా పెడితే.. ఇవాళ మీరేం కొత్తగా ఏం చెప్పారు. మీరు చెప్పిందే మొన్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో చెప్పారు. సబ్‌కమిటీ చైర్మన్‌గా చెప్పిన లెక్కలన్నీ.. సీఎం ఇవాళ చెప్పారు. ఎందుకు ఇవాళ సభ పెట్టారు? 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పిస్తూ బిల్లు తెస్తారని మేం అనుకున్నాం. మీరు చెప్పినట్లు 56శాతం బీసీలు ఉంటే.. వారికి బీసీ సబ్ ప్లాన్ తెస్తరేమోనని అనుకున్నాం. ఏమీ తేకుండా.. ఇవాళ నివేదికన సభలో పెట్టామంటే.. చరిత్ర అని చెప్పుకుంటే కాదు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని' కేటీఆర్ డిమాండ్ చేశారు.

# 98లక్షల జనాభా తగ్గించారు..

### అసెంబ్లీలో ప్రభుత్వంపై మండిపడ్డ పాయల్ శంకర్



**విశ్వంభర, హైదరాబాద్:** కుల గణన సర్వేలో 98లక్షల జనాభా తగ్గించారని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండిపడ్డారు. అసెంబ్లీలో సర్వే నివేదికపై చర్చ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల్లో ఓట్లు పొందేందుకు మాత్రమే బీసీల నినాదం ఎత్తుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తున్నారన్నారు. టికెట్ల కేటాయింపు దగ్గర నుంచే బీసీలకు అన్యాయం జరుగుతుందని.. జనాభా ప్రకారం బీసీలకు సగం సీట్లు ఇస్తామని రాజకీయ పార్టీలు చెబుతున్నాయన్నారు. గెలుపు అవకాశాలు లేని స్థానాలను బీసీలకు కేటాయిస్తున్నారని.. ఎంబీసీలకు రూ.3వేలకోట్లు కేటాయించి.. కేవలం రూ.15కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కుల సంఘాల భవనాలకు స్థలం కేటాయింపులోనూ బీసీలకు అన్యాయం జరుగుతోందని.. బీసీ భవనాలకు స్థలాలను హైదరాబాద్‌కు 60 కిలోమీటర్ల దూరంలో కేటాయించారన్నారు.

అగ్రవర్ణాల వారి కులభవనాలకు మాత్రం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ కేటాయించారని.. బలహీనవర్గాల వారి విషయంలో కేవలం తీర్మానాలు చేసి వదిలేస్తున్నారన్నారు. ప్రభుత్వం చెప్తున్న లెక్కల ప్రకారం.. జనాభా సంఖ్యకు పొంతన లేదన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట ప్రకారం.. రాష్ట్ర జనాభా 4.33కోట్లు అని తెలుస్తుందని.. సర్వే ప్రకారం మాత్రం రాష్ట్ర జనాభా 3.76కోట్లు అని చెప్తున్నారన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా ఈ సర్వేలో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అనే కొత్త పదాలను సృష్టించారని.. హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అనే వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టివేస్తుందన్నారు. హైకోర్టు అయినా.. ముస్లిం బీసీ అనే పదం వాడారని ఒకసారి మామూలు వ్యక్తి పిటిషన్ వేస్తే వారం రోజుల్లో కొట్టివేస్తుందని.. కోర్టుల్లో కేసులు వేసి బీసీ రిజర్వేషన్ల పెంపును జాప్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

కోర్టుల పేరు చెప్పి ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల పెంపును పక్కనపెడుతుందన్నారు. తెలిసి చేస్తున్నరా? అధికారుల తప్పిదమా? అని విమర్శించారు. ఎలాగైనా కొట్టివేసేదే కదా? ఒకరోజులో అసెంబ్లీలోనే కదా.. ఏదో నాలుగు కాగితాలు పెట్టియేండి కిరికిపోతది.. రేపోమాపో ఎన్నికలకు పోవాలని చూస్తున్నారా? మాకు అర్థం అవుతలేదన్నారు. రాజకీయంగా తప్పించుకునే ప్రయత్నం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. మా పరిధి కాదు.. కేంద్ర ప్రభుత్వమని చెప్పి రాజకీయంగా మీరు తప్పించుకునే ప్రయత్నం చేయొద్దన్నారు. తీర్మానం చేసి.. ఢిల్లీకి పంపించకుండా చట్టబద్ధత చేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంత ఆపారమైన అనుభవం అంటే.. భారతదేశంలో ఏయే కోర్టులు ఏయే కోర్టులు కొట్టివేశాయో.. ఏం లొసుగులు ఉన్నయో వాటిపై అవగాహన ఉన్నది. 42శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నప్పుడు.. ఉన్న ఇబ్బందులు తెలుసునన్నారు. ఈ 14 నెలల్లో మీరు చేయాల్సిన కార్యక్రమాలు చేయలేదని.. స్థానిక సంస్థల గడువు ముగిసింది.. రేపో మాపో ఎన్నికలు జరుగుతాయని.. హడావుడి పడి తప్పుడు తడకలతో కూడిన నివేదిక తయారు చేస్తే కోర్టులు కొట్టివేస్తాయన్నారు. ముఖ్యమంత్రి ఓ మాట చెప్పారు.. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్ అంటేశామని చెప్పారు.

మా ఇంటికి రెండు స్టికర్స్ వేశారు. ఒక ఇంటికి రెండు స్టికర్స్ వేస్తారంటే.. ఏమో సర్ అన్నారని.. బీసీ జనాభాను ఎక్కువ చూపిస్తారని తాను అనుకున్నానని.. ప్రభుత్వం పెట్టిన ఈ నివేదిక చూస్తే మా సంఖ్య తగ్గిపోయిందన్నారు. అగ్రవర్ణాల్లోనూ పేదలు ఉన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ జోక్యం చేసుకొని స్టిక్కర్స్ రెండు వేస్తే.. అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మళ్లీ పాయల్ శంకర్ మాట్లాడుతూ.. రెండు స్టికర్స్ వేసిన అధికారులపైనే చర్యలు తీసుకుంటామన్నారని.. వాళ్ల పేర్లు చెబితే మంచిదని అంటున్నారని.. కానీ, 98లక్షల జనాభా తగ్గించిన వారి వివరాలు చెప్పడం లేదన్నారు. మధ్యలో మరోసారి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కల్పించుకొని.. దేశంలో ఎక్కడా లేనివిధంగా సర్వే చేపట్టామన్నారు. కులగణన సర్వేను పటిష్టంగా నిర్వహించామన్నారు. దీనికి పాయల్ శంకర్ బదులిస్తూ తాను ప్రభుత్వ వెబ్‌సైట్ డేటా, ప్రభుత్వం ఇచ్చిన నివేదికను మాత్రమే పరిగణలోకి తీసుకొని చెబుతున్నానన్నారు.

## బీసీ కుల గణన సర్వే తప్పుల తడక.. అశాస్త్రీయం..

### బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన సర్వే తప్పుల తడకగా, కాకి లెక్కలతో అశాస్త్రీయంగా ఉందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్వహించిన జన గణన లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.50 కోట్లకు పైగా ఉన్నారని, 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 3,68,76,544 మంది బీసీలు ఉన్నారని రవిచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన సర్వేలో జనాభా 3,70, 77,544 మంది మాత్రమే ఉన్నారని తేలిందన్నారు.

గత పదేండ్లలో తెలంగాణలో బీసీల జనాభా కేవలం రెండు లక్షలు మాత్రమే పెరిగిందనడం విడ్డూరంగా ఉందని రవిచంద్ర పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీలు (ముస్లింలలోని బీసీలు కాకుండా) 52 శాతం అని నిర్ధారణ అయిందన్నారు. కానీ ప్రస్తుతం బీసీల జనాభా (ముస్లింల్లోని బీసీలు మినహా) 46 శాతమేనని, ఆరుశాతం తగ్గించి చూపడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభాను తగ్గించి చూపడమే కాక,ఈ తప్పులతడక సర్వే నివేదికను క్యాబినెట్ ఆమోదించి, చట్టసభల్లో ప్రవేశపెట్టి ప్రజలకు తప్పుడు సమాచారమిచ్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తీవ్ర అభ్యంతరకరమన్నారు.

రాజ్యాధికారంలో బీసీలను భాగస్వాములను చేయాలన్న చిత్తశుద్ధి అధికార కాంగ్రెస్ పార్టీలో లోపించిందని ఎంపీ వద్దిరాజు మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసే ఉద్దేశం కాగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఏ కోశానా కూడా లేదని ఈ అశాస్త్రీయ కులగణన సర్వేతో తేటతెల్లమయ్యిందన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ పాలకులకు చాలా చులకన భావం నెలకొందని చెప్పడానికి క్యాబినెట్ కూర్పే ఒక ప్రబల నిదర్శనమని ఎంపీ రవిచంద్ర చెప్పారు. బీసీలలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరు కాపు, యాదవ, ముదిరాజ్, కుర్మలకు మంత్రివర్గంలో చోటివ్వకపోవడం, రాజ్యాధికారంలో న్యాయమైన వాటా దక్కకపోవడం శోచనీయమని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.

బీసీ కులగణన సర్వేలో చోటుచేసుకున్నతప్పులను వెంటనే సరిదిద్దాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేబినెట్ విస్తరణలో నలుగురు బీసీలకు స్థానం కల్పించాలన్నారు. అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీలను బీఆర్ఎస్ మరింత సంఘటితపరుస్తూ న్యాయమైన హక్కులు, వాటా కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

## త్రిషా, ధ్రుతికి ఘన స్వాగతం

**విశ్వంభర, హైదరాబాద్:** ఐసీసీ అండర్19 టీ20 వరల్డ్‌కప్‌లో సత్తా చాటిన గొంగడి త్రిషా రెడ్డి, టీమిండియా సభ్యురాలు కేసరి ధ్రుతికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అరశనపల్లి జగన్‌మోహన్ రావు ఘన స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఈ ఇరువురిని జగన్‌మోహన్ రావు సత్కరించారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా చేసిన త్రిషాను జగన్‌మోహన్ రావు ప్రత్యేకంగా అభినందించారు. త్రిషా, ధ్రుతిను ఆదర్శంగా తీసుకుని మరింత మంది మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. త్వరలో అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి నగదు బహుమతి ప్రకటిస్తామని వెల్లడించారు.



## బీఆర్ఎస్ పార్టీ విప్‌గా ఎమ్మెల్యే వివేకానంద్



**విశ్వంభరా, కుత్బుల్లాపూర్:** ఎమ్మెల్యే వివేకానంద్ ను తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా తనను ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పార్టీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ ఈ బాధ్యతను పూర్తి నిబద్ధతతో, పార్టీ ఆదేశాలను పాటిస్తూ, శాసనసభలో పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పని చేస్తాను అని పేర్కొన్నారు.అలాగే, పార్టీ నాయకత్వం తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షల నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## మగ్దూం మొహియుద్దీన్ 117వ జయంతి



**విశ్వంభర, ఎల్బీనగర్:** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖ కవి, కార్మిక వర్గ విప్లవకారుడు కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ 117వ జయంతిని సీపీఐ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి హాజరై మగ్దూం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మగ్దూం మొహియుద్దీన్ కేవలం కవి మాత్రమే కాకుండా, తెలంగాణ సాయుధ పోరాట యోధుడిగా, కార్మిక వర్గ హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా గుర్తింపుపొందారని అన్నారు. ఆయన కవిత్వం విప్లవోద్యమానికి మార్గదర్శనంగా నిలిచిందని, మొహియుద్దీన్ జీవిత సాధనలను స్మరించుకుంటూ, ఆయన స్ఫూర్తిని తీసుకుని సామాజిక న్యాయం కోసం పోరాడాలని యువతను కోరారు. సమాజంలోనూ మగ్దూం ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్ రెడ్డి, సహాయ కార్యదర్శి బాతరాజు నర్సింహ, అరుణ్ కుమార్ గౌడ్, మర్రి శోభన్, వంశి వర్ధన్ రెడ్డి, రమావత్ సక్రు నాయక్, చెంది వెంకట్, నాగరాజు, కార్యనిర్వహణ అధ్యక్షులు మందుల కృష్ణ, ఇరుగు జ్యోతి, శ్రీదర్ రెడ్డి, రాములు, అరుణ, సౌజన్య, సుమతి, అలివేణి, యమున పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి కుటుంబానికి నాయకుల పరామర్శ

**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీ రాయల్ పార్క్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి గత నాలుగు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం తన వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొని మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్ రావు,మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, అతని కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం మైనంపల్లి హన్మంత్ రావు, కూన శ్రీశైలం గౌడ్, భూపతి రెడ్డి మాట్లాడుతూరియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి మరణం చాలా బాధాకరమన్నారు. అతని మరణం వారి కుటుంబానికి తీరని లోటు అన్నారు.ప్రభుత్వం తరుపున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంపల్లి మున్సిపాల్టి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్,బొంగురి కిషోర్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్,గారిశే రాజు, రాజేష్ ఉప్పల, శివ కుమార్ గౌడ్, పూర్ణచందర్ రావు, శ్రీనివాస్ యాదవ్, అంజి ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్ రెడ్డి గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు..



# తెలంగాణలో రాజుకున్న కులగణన చిచ్చు



- రేవంత్ సర్కార్‌పై ప్రతిపక్షాలు, బీసీ సంఘాల ఫైర్!
- 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభా 3.63 కోట్లు
- 2024 ప్రభుత్వ కులగణన సర్వే ప్రకారం జనాభా 3.54 కోట్లు
- 51శాతం ఉన్న బీసీ జనాభా 46.25 శాతానికి తగ్గింది
- కులగణనపై సర్వత్రా అనుమానాలు..
- అసెంబ్లీలో వాడివేడిగా కొనసాగిన కులగణనపై చర్చ
- అధికార, విపక్షాల మధ్య పేలిన మాటల తూటాలు
- తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకం
- బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది: సీఎం రేవంత్ రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో సమగ్ర కులగణన సర్వే రిపోర్ట్‌పై చేసిన ప్రకటనపై అటు ప్రతిపక్షాలు.. ఇటు బీసీ సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాయి. కులగణన సర్వే రిపోర్ట్ చరిత్రాత్మకమని ఈ సర్వే ద్వారా దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అవుతుందని ఆశించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సర్వేలో బీసీల జనాభా గణనీయంగా తగ్గడంపై బీసీ సంఘాల నుంచి అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయి.2014లో నిర్వహించిన సమగ్ర సర్వేలో 11 శాతం ఉన్న ఓసీ జనాభా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కులగణన సర్వేలో 15.79 శాతానికి పెరిగిందని.. బీసీలు, ముస్లింలతో పోలిస్తే ఓసీ జనాభా ఎక్కువ ఎలా పెరిగిందని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ప్రయోజనాలు కాపాడటానికే.. సర్వే రిపోర్ట్‌లో బీసీ జనాభా తగ్గించి ఓసీ జనాభా పెంచారని ఆరోపణలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన కులగణన లెక్కలపై ఎందుకు ఇంత రాద్ధాంతం జరుగుతోంది.

**కులగణనపై సర్వత్రా అనుమానాలు..**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన కులగణన నివేదికపై సామాజికవేత్తలు, బీసీ సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా 46.25 శాతం మాత్రమే ఉందంటూ నివేదిక వెల్లడించడాన్ని తప్పుబడుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే తప్పులతడకగా కొనసాగిందని మండిపడుతున్నారు. 2023లో బీహార్‌లో చేపట్టిన కులగణన సర్వేలో బీసీల వాటా ఆ రాష్ట్ర జనాభాలో ఏకంగా 63.14 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నారు. అయితే, తెలంగాణలో మాత్రం ఇది 46.25 శాతానికి పరిమితం కావడమేంటని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు అరకొర సమాచారాన్నే సేకరించారని, శాస్త్రీయత లేకుండా నిర్వహించిన ఈ సర్వేతో తెలంగాణలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపితే కాంగ్రెస్ భూస్థాపితమే : జాజుల శ్రీనివాస్‌గౌడ్**

కులగణన పేరుతో బీసీల సంఖ్యనుతక్కువ చేసి చూపిస్తే.. గద్దెనెక్కేందుకు దోహద పడ్డ బీసీలే కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తారని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టడంలో తగిన ప్రామాణికాలు పాటించలేదని, ఫలితంగా బీసీల సంఖ్య తప్పుల తడకగా వచ్చిందని, ఈ విషయాన్ని గత సెన్సస్ వివరాలతో పోల్చి చూస్తే స్పష్టంగా తెలుస్తోందన్నారు. బీసీ కులగణన నివేదికలో ఊహించని విధంగా దొర్లిన తప్పిదాలను 48 గంటల్లో సరిదిద్ది, సరి చేసిన నివేదిక వివరాలను పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ..**

ఈ సందర్భంగా కులగణనపై అసెంబ్లీలో వాడివేడిగా చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కులగణన నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వే చరిత్రాత్మకమన్నారు. ''రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం.

జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.బీసీలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారాయన. అందుకే కులగణన సర్వే రిపోర్ట్‌ని కేబినెట్‌లో ఆమోదించి చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రవేశపెట్టామన్నారు.కులగణన సర్వేపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల తూటాలు పేలాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తే.. 42శాతం రిజర్వేషన్ల బిల్లు పెడుతున్నరేమో అనుకున్నామని.. చివరకు ఏదో సర్వే రిపోర్ట్‌ని పెట్టారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. అసెంబ్లీలో బీసీ కుల గణన నివేదికపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి చారిత్రాత్మకమైన ప్రత్యేక శాసనసభ సమావేశాల్లో కామారెడ్డి డిక్లరేషన్ తరహాలో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి బిల్లు ప్రవేశపెడతారేమోనని.. ఆ బిల్లును శాసనసభలో ఆమోదింప చేసి.. చట్టబద్ధత కల్పిస్తారేమోనని రాష్ట్రవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ, ముఖ్యమంత్రి లేచి నాలుగు పేర్లు చదువుతున్నారు. మీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. ఎందుకంటే రేవంత్‌రెడ్డి గారు మీరే చెప్పారు' అంటూ విమర్శించారు.ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఓట్లు పొందేందుకే బీసీ నినాదం అందుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కలు, రాష్ట్ర జనాభా సంఖ్యకు పొంతన లేదన్నారు. ''ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.33 కోట్లు అని తెలుస్తోంది. కులగణన సర్వే ప్రకారం రాష్ట్ర జనాభా 3.76 కోట్లుగా తెలుస్తోంది. టికెట్ల కేటాయింపు దగ్గర నుంచే బీసీలకు అన్యాయం జరుగుతోంది. జనాభా ప్రకారం బీసీలకు సగం సీట్లు ఇస్తామని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. గెలుపు అవకాశాలు లేని స్థానాలకు బీసీలను పరిమితం చేస్తున్నారన్నారు.

కులాల జనాభా లెక్కల్లో ఇన్ని తేడాలు ఎందుకని ప్రశ్నించారు మాజీమంత్రి తలసాని.తెలంగాణ న్యాయం కోసం ఎదురుచూస్తోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శాసనసభను ప్రారంభమైన వెంటనే వాయిదా వేయడాన్ని ఆయన ఖండించారు. నాలుగు రోజుల పాటు చర్చలు జరగాలని డిమాండ్ చేశారు. . ఇక కులగణన సర్వే నివేదికను సభలో టేబుల్ చేయాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ కోరారు. అయితే వీరికి సమాధానం ఇచ్చారు మంత్రులు.


**ఒకసారి కాంగ్రెస్ ప్రభుత్వ లెక్కలు, బీసీ సంఘాలు చెబుతున్న లెక్కలను పరిశీలిస్తే..**


- 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం తెలంగాణలో 18శాతం ఉన్న SC జనాభా ప్రభుత్వ సర్వే ప్రకారం 17.43 శాతానికి తగ్గిందని.. అంటే ఎస్సీ జనాభా 0.57 శాతం తగ్గిందని బీసీ సంఘాలు అంటున్నాయి.
- 10శాతం ఉన్న ST జనాభా ప్రభుత్వ సర్వే ప్రకారం 10.48 శాతానికి పెరిగింది. అంటే ఎస్టీ జనాభా స్వల్పంగా 0.48 శాతం పెరిగింది.
- 8శాతం ఉన్న ఓసీ జనాభా 13.31 శాతానికి పెరిగింది. అంటే 5.31 శాతం ఓసీ జనాభా పెరిగింది.
- 51శాతం ఉన్న బీసీ జనాభా 46.25 శాతానికి తగ్గింది.
- 13 శాతం ఉన్న ముస్లిం జనాభా 12.56 శాతానికి తగ్గింది.
- 10 శాతం ఉన్న బీసీ ముస్లిం జనాభా 10.08 శాతానికి పెరిగింది.
- 3 శాతం ఉన్న ఓసీ ముస్లిం జనాభా 2.48 శాతానికి తగ్గింది.
- ప్రభుత్వ సర్వేలో బీసీల జనాభా తగ్గి.. ఓసీల జనాభా ఎలా పెరిగిందని.. జనాభా పెరుగుదల సగటు అన్ని కులాలలో ఒకేలా ఉండాలని ఓసీలతో పోలిస్తే ముఖ్యంగా సహజంగా బీసీలలోనే జనాభా పెరుగుదల ఎక్కవ ఉండాలని.. కానీ ప్రభుత్వ సర్వే లెక్కలు దీనికి విరుద్ధంగా ఉన్నాయంటున్నాయి బీసీ సంఘాలు. -EWS రిజర్వేషన్ ప్రయోజనాలు కాపాడటానికే.. సర్వే రిపోర్ట్‌లో బీసీ జనాభా తగ్గించి ఓసీ జనాభా పెంచి చూపించారని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.
- 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా 3.5 కోట్లు
- 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభా 3.63 కోట్లు
- 2024 ప్రభుత్వ కులగణన సర్వే ప్రకారం జనాభా 3.54 కోట్లు
- జనాభా వృద్ధి రేటు ప్రకారం పదేళ్ల తర్వాత జనాభా పెరగాలి కానీ ఎలా తగ్గింది?
- దీన్ని బట్టే ప్రభుత్వ కులగణన సర్వే లెక్కలు తప్పు అని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం వాదిస్తోంది.


**బీసీలను మోసం చేసేందుకే నివేదిక: తీన్మార్ మల్లన్న**

శాసనమండలిలో ప్రవేశపెట్టిన కుల గణన సర్వేపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన లెక్కలు.. కుల గణనకు పొంతన లేదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన నివేదిక ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ జరగదు అని అన్నారు. 4 కోట్లకు పైగా ఉండాల్సిన రాష్ట్ర జనాభా సర్వేలో తగ్గిందని ఆయన తెలిపారు. బీసీల జనాభా తగ్గి ఓసీల జనాభా ఎలా పెరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు 2011 జనాభా లెక్కలు తీసుకున్నారని విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్ అమలుకు ప్రస్తుత సర్వే లెక్కలు తీసుకున్నారని దుయ్యబట్టారు. ఇది పూర్తిగా బీసీలను మోసం చేసేందుకే ప్రభుత్వం తయారు చేసిన నివేదిక అని.. తీన్మార్ మల్లన్న ఆరోపించారు.

# ప్రజల మనిషి.. వట్టికోట ఆళ్వారుస్వామి









స్వసుఖం కోరని వాడు, వారం వారం మారని వాడు, రంగులు అద్దుకోలేనివాడు, అబద్ధాసురుని పాలిట తల్వార్ అల్వార్' అని దాశరథి చేత కీర్తించబడిన వాడు, 'వాడు చరిత్రకారుడు కాదు వాడే ఒక చరిత్ర' అంటూ కాళోజిచే ప్రశంసలందుకున్న తెలంగాణ వైతాళికుడు, తెలంగాణ సాహితీ సరస్వతి కన్న మరో అక్షరం వట్టికోట ఆళ్వారుస్వామి. తెలంగాణ ప్రజల జీవితాన్ని, పోరాట తత్వాన్ని, సంస్కృతిని నరనరాన జీర్ణించుకుని గ్రంథ పఠనం ద్వారా లోకజ్ఞానం కలుగుతుందని సమాజాన్ని అర్థం చేసుకొని ప్రజలను చైతన్య పరచవచ్చని ఊరూరా గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించి ప్రజా చైతన్యానికి బాటలు వేసిన ప్రముఖ సాహిత్య దిగ్గజం వట్టి కోట.

**సాంస్కృతిక పునర్జీవనానికి పునాదులు వేసిన వైతాళికుడు..**

జీవించినంత కాలం ప్రజల మనిషిగా జీవించిన ఆళ్వార్ స్వామి నిజాం సంస్థానంలోని తెలంగాణలో కొనసాగించిన ప్రజా పోరాటం మరువలేనిది. నిజాం సంస్థానాధీశుని పాలనలో నీ బాంచన్ దొర నీ కాల్మొక్త అనే స్థితి నుంచి బందూకులు పట్టించిన రచనలు ఆయనవి. నిబద్ధతను నిండుగా అవపోసన పట్టుకుని నైతిక విలువలను చెప్పి, చెప్పింది రాసి, రాసింది చేసి ఆచరించి చూపిన మహా వ్యక్తి. ఒక చేతిలో గన్ను ఇంకొక చేతిలో పెన్నుతో తెలంగాణ జాగృతి కోసం తెలంగాణ మట్టిగడ్డపై పోరు విత్తనాలు జల్లి ఉద్యమ సుమాలను పూయించిన సాహిత్య ఉద్యమ రైతు వట్టి కోట. తనకలాన్ని మర ఫిరంగుగా, అక్షరాలను ఇనుప గుళ్ళుగా మార్చి నిరంకుశ బూర్జువా గట్టి గోడలను కూల్చిన ఘనుడు. వెట్టిచాకిరిని నిర్మూలించడం కోసం వెట్టి కోటలను కాల్చిన కాగడా ఆయన. నవ తెలంగాణ నిర్మాణానికి సాంస్కృతిక పునాదులు వేసిన కవి, కార్మిక వైతాళికుడు వట్టికోట.

**గ్రంథాలయాన్నే గురువుగా మార్చుకుని..**

వలసవాదం, భూస్వామ్యం కింద నలుగుతున్న తెలంగాణను విముక్తి చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించిన వట్టికోట ఆళ్వారుస్వామి, 1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారం గ్రామంలో ఓ నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో పొట్టకూటి కోసం అనేక పనులు చేశాడు. అదే క్రమంలో కాంచనపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయుని వద్ద వండి పెడుతూ విద్యాభ్యాసం, సారస్వతాభ్యాసం పూర్తి చేశాడు. తదుపరి సూర్యాపేట గ్రంథాలయంలోని నాలుగు గోడల మధ్య విద్యాభ్యాసం లోకజ్ఞానాన్ని సంపాదించుకున్నారు. ఆ గ్రంథాలయాన్ని గురువుగా మార్చుకొని సాహిత్య ఊపిరి పోసుకున్నారు. ఇంగ్లిష్, ఉర్దూ భాషలు కూడా నేర్చుకొని తనకు తానుగా ప్రపంచాన్ని పరిచయం చేసుకున్న గ్రహణశీలి. ఆ తర్వాత విజయవాడలో వెల్‌కమ్ హోటల్లో సర్వర్‌గా పని చేస్తూ సాహిత్యకారులతో సంబంధాన్ని అనుబంధాన్ని కొనసాగించారు

ఆ తర్వాత 1933లో హైదరాబాద్ వచ్చారు. గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేశారు. మరోపక్క చదువుకుంటూ తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. ఆళ్వార్ స్వామి స్వయం కృషిచే ఎదిగిన విజ్ఞానవేత్తగా మాత్రమే కాకుండా చక్కని రచయితగా కూడా ప్రఖ్యాతి గడించాడు.1936-37లో గోల్కొండ పత్రిక ప్రూఫ్ రీడర్‌గా, తరువాత మీర్జాన్ పత్రికకు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పని చేశాడు. విజ్ఞానానికి విలువ కట్టని సమాజం వృద్ధి చెందదు, వికసించదు అని బలంగా నమ్మి హైదరాబాదులో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించారు. సురవరం రాసిన హైందవ ధర్మాలు ప్రాథమిక సత్యాలు, ప్రజాకవి కాళోజీ రచించిన నా గొడవ మొట్టమొదటగా దేశోద్ధారక నుండే ప్రచురింపజేశారు. తెలంగాణ ప్రముఖ రచయితలు రచించిన 35 పుస్తకాలు ఈ దేశోద్ధారక గ్రంథమాల నుంచి ప్రచురించబడ్డాయి. ఊరూరా తిరుగుతూ కవితలు రచనలు సేకరిస్తూ గ్రంథాలను పంచుతూ ప్రజా చైతన్యానికి బాటలు వేసిన సాహిత్య బాటసారి వట్టి కోట.1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. మరోపక్క ఆంధ్ర మహాసభ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేవారు. కొంతకాలం నల్గొండ జిల్లా ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా పనిచేశారు.కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం వంటి సామాజిక రాజకీయ సాహిత్య సంస్థలన్నింటికీ కార్యకర్తగా నాయకుడిగా పని చేశారు. గ్రంథాలయ ఉద్యమ ప్రేరణ నుండి బయలుదేరి నిజాం వ్యతిరేక ఉద్యమం దాకా నడిచిన ప్రజా చైతన్య శీలి వట్టికోట. ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపించిన ఆళ్వార్ స్వామిని నిజాం ప్రభుత్వం 1946లో అరెస్టు చేసింది. ఆయనను సంగారెడ్డి, గుల్బర్గా, వరంగల్, నిజామాబాద్ జిల్లాలో నిర్బంధించారు. నిజామాబాద్ జైల్లో ఉన్నప్పుడు దాశరథి ఆయనకు సహ ఖైదీ. సామాజిక స్పృహ ఉన్న రచయితనిజామాబాద్ జైలులో దాశరథితో పరిచయం వారి ఇరువురికి విడదీయరాన్ని బంధాన్ని ఏర్పరిచింది వారి మధ్య ఎప్పుడూ సాహిత్య చర్చలు జరిగేవి. దాశరథి పద్యాలను వట్టి కోట బొగ్గుతో గోడలపై రాసి దెబ్బలు తిన్నాడు. నిజాంపై రాసిన పద్యాలను కంఠస్థం చేసిన సాహిత్య అభిలాషి.ఈయన ప్రేరణతో దాశరథి అగ్నిధార కురిపించాడు. అంకితం ఇచ్చాడు.

**తెలంగాణలో మొదటి నవల 'ప్రజల మనిషి'**

తెలంగాణ తొలి నవలాకారుడు ఆళ్వార్ స్వామి. తెలంగాణ తొలి నవల 'ప్రజల మనిషి'. ఈ నవల 1938 కి పూర్వం నిజాం పాలన కింద ఉన్న తెలంగాణ ప్రజా జీవితాన్ని చిత్రీకరించింది. ప్రజల మనిషి కథ అతి పలుచని పొర. ఉద్యమం కోసం అల్లిన చిన్న కథ. ఇది ఉద్యమ నవల మాత్రమే కాదు. సాంఘిక చరిత్ర. నాటి అమలిన జీవితాన్ని ప్రేమలు, ఆప్యాయతలు, వేదనలను అతి సున్నితంగా మనసుకు హత్తుకునే విధంగా ఆయన చిత్రించాడు. ఇది నెత్తుటి మరకలేని నవల. ఈ నవలలో సంభాషణలు తక్కువ, ఉపన్యాసాలు ఎక్కువ అని దాశరథి రంగాచార్యులు అన్నారు. ఇతని మరో నవల 'గంగు'. ఇది రాజకీయ నవల కానీ రాజకీయాలే కాక దానిలో తెలంగాణ ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు కూడా ఉంటాయి. కనుక ఇది చారిత్రక నవల అనడం సముచితం అని ప్రకాశకులు అన్నారు. ఈ నవల 1940-45 మధ్య తెలంగాణలో జరిగిన రాజకీయ ప్రజా ఉద్యమాలను, తెలంగాణ సాయుధ పోరాట చైతన్యాన్ని అక్షరీకరించింది. ఆళ్వార్ తన జైలు అనుభవాల ఆధారంగా "జైలు లోపల" అనే కథల సంపుటి రాశారు. అలాగే స్వామి మరో రచన 'రామప్ప రభస' నాటి సామాజిక సమస్యలను వ్యంగంగా ప్రతిభావంతంగా కళ్ళెదుట నిలుపుతుంది. సామాన్యుడి జీవితాన్ని సాహితీ పీఠం ఎక్కించిన సాహితీ ద్రష్ట. దళితుల దుర్భర స్థితిని అద్దం పట్టే కాపీర్లు కథ రాశాడు. సాయుధ పోరాట విరమణ వ్యతిరేకిస్తూ రాజకీయ బాధితుడు కథలో కమ్యూనిస్టు విధానాన్ని తప్పుపట్టిన దీశాలి. ఎవరి తిండి వారు తినొచ్చు అంటూ తెలుగు సాహిత్యంలో ఎద్దు మాంసంపై చర్చ లేవనెత్తిన సామాజిక స్పృహ కలిగిన రచయిత. దొరలు జాగీర్దార్ల ఆగడాలను పూస గుచ్చినట్టు గిర్దవర్ కథలో వివరించాడు. మొత్తం మీద ఆళ్వార్ స్వామి తన కోసం ఏమీ సంపాదించుకోలేదు.

**నవతెలంగాణ దివిటీ**

తన రచనల ద్వారా ప్రసరించిన అభ్యుదయ కిరణాలు నేటి నవ తెలంగాణ నిర్మాణానికి దిశా నిర్దేశం చేయగల దివిటీలని చెప్పడంలో ఎటువంటి అతిశక్తి లేదు. తెలంగాణ భాషకు, యాసకు పెద్ద పీట వేసిన సాహిత్య మేరు నగధీరుడు. 1961 ఫిబ్రవరి 5న వట్టి కోట ఈ లోకాన్ని విడిచి వెళ్ళాడు. తనతో జైలు జీవితం గడిపిన వట్టికోటకు దాశరథి తన అగ్నిధార సంకలనాన్ని అంకితం చేశారు. కథకునిగా, వ్యాసకర్తగా, నవలా రచయితగా, విమర్శకుడిగా, కవిగా, ఉపన్యాసకుడిగా, పత్రికా రచయితగా, ప్రచురణ కర్తగా, పరిశోధకుడిగా, గ్రంథాలయ నిర్వహకుడిగా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన బహుముఖ ప్రజ్ఞాశాలి వట్టికోట. తెలంగాణ ఏర్పడిన తర్వాత వట్టికోట శతజయంతిని ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ కేంద్ర గ్రంథాలయానికి వట్టికోట పేరుని నామకరణం చేశారు. అంతేగాక అతని స్వగ్రామంలో, హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై వట్టి కోట విగ్రహాలని ఏర్పాటు చేశారు. హోటల్లో స్వీపర్‌గా జీవితాన్ని ప్రారంభించి, ఉద్యమాన్ని ఊపిరిగా గ్రంథాల సుగంధాలను ఊరూరా వ్యాపింపజేసి ప్రజా చైతన్యాన్ని పెంపొందించి మనిషి జీవితానికి సమాజమే పరమార్థంగా జీవనాన్ని గడిపిన వట్టికోట మనందరికీ స్ఫూర్తిదాయకం.

## బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా వనం అంజయ్య



**విశ్వంభర, రామన్నపేట:** మండల కేంద్రానికి చెందిన వనం అంజయ్యను భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియామకం చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డికి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకరికంటి మొగులయ్యకు ధన్యవాదాలు తెలిపారు. వనం అంజయ్యను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమించినందుకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దావునూరి వెంకటేశం, ముగ్గు నరసింహ, రమేష్, గట్క శ్రీనివాస్, భైరబోయిన రమేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి తనను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమించినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## దివ్యాంగులకు క్రీడా పోటీలు




**విశ్వంభర, హైదరాబాదు :** బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము చిక్కడపల్లి శాఖలో స్వీకార్ స్పెషల్ స్కూల్ ఫర్ ది డెఫ్ అండ్ ఉన్నతి జూనియర్ కాలేజీ ఫర్ ది హీరింగ్ హ్యాండిక్యాప్డ్ , బాలవికాస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ డిసేబుల్డ్ చిల్డ్రన్ స్కూల్స్ నుండి 130 మంది దివ్యాంగులైన పిల్లలకు క్యారమ్స్, చెస్, డ్రాయింగ్, మెహందీ పోటీలను నిర్వహించారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెల్చుకున్నారు. స్వీకార్ స్పెషల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస రావు అభిజ్ఞ భారత సంస్థ ఫౌండర్ నిర్వాహకురాలు డాక్టర్ కావ్య ముఖ్య అతిథి గా హాజరై బ్రహ్మ కుమారీస్ యొక్క సేవా కార్యక్రమాలు దివ్యాంగుల సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. పిల్లలకు నైతిక విలువలు, పాజిటివ్ థింకింగ్, కారక్టర్ బిల్డింగ్ తదితర అంశాల గురించి చిక్కడపల్లి శాఖ ఇన్చార్జి జయశ్రీ తెలియచేసారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారి తరపున దివ్యాంగుల కోసం భారత సంస్థ ఫౌండర్ వారికి కొంత నగదును చెక్కు రూపకంగా అందజేశారు.

## మూడుముళ్ల బంధం ఏడడుగుల వేడుకతో ఒక్కటైన భారత్, బల్గేరియా ప్రేమ జంట



**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యానగర్ లో నివాసం ఉంటున్న చలమశెట్టి వెంకటేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు అవినాష్ కార్తీక్ జర్మనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బల్గేరియా దేశానికి చెందిన అలెగ్జాండ్రోవా, మెటోడీ ఇవానోవా దంపతుల కుమార్తె యెవానా కూడా అవినాష్ కార్తీక్ చేసే కంపెనీలో సహ ఉద్యోగి ఇద్దరి మధ్య కొనసాగిన కొన్ని నెలల స్నేహం కాస్త ప్రేమకు దారి తీసింది. ఇరువురి కుటుంబీకుల పెద్దలను ఒప్పించి మరో అడుగు ముందుకు వేశారు. ఈనెల రెండవ తారీఖున వివాహ వేడుక ఖరారు కావడంతో భారతదేశానికి బల్గేరియా దేశానికి సంబంధించిన బంధువులంతా హైదరాబాద్ నగరానికి చేరుకొని వివాహ వేడుకలకు హాజరయ్యారు. హైదరాబాద్ నగరంలో యెవానా అవినాష్ కార్తీక్ ల వివాహం రెండవ తారీకున మూడుముళ్ల బంధంతో పెద్దల సమక్షంలో ఒకటయ్యారు. వివాహ వేడుక అంతా తెలుగు సంప్రదాయల ప్రకారం ఘనంగా నిర్వహించామని భాగ్యలక్ష్మి తెలిపారు. అంబర్పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేర వెంకటేష్ నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరిక



**విశ్వంభర, షాబాద్ :** మండలంలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెదవేడు గ్రామ మాజీ సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్ గౌడ్, రంగారెడ్డి జిల్లా సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షుడు ఉద్యమ నాయకుడుదామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరిని సాదరంగా పార్టీలోకి చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు సహాయ సహకారాలు కచ్చితంగా అందిస్తామని వారు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.


## నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం

**విశ్వంభర, చింతపల్లి :** పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి ప్రజలు మెచ్చింది, పేదలు నచ్చిందని అని చింతపల్లి బీజేపీ మండల అధ్యక్షులు సముద్రాల నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు, కర్షకులకు మేలు జరిగే విధంగా, పాడి పరిశ్రమ, మత్యకారులకు ప్రత్యేకమైన కేటాయింపులను కల్పించిన బడ్జెట్ అని, రహదారుల నిర్మాణం, రైల్వే మరియు విమానాశ్రయాల అభివృద్ధితో 'సాబ్ కా సాథ్ సాబ్ కా వికాస్' బడ్జెట్ తో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా ఉన్న ఈ బడ్జెట్ ను అందరు స్వాగతిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో శివర్ల రమేష్, వెన్నం శేఖర్, కుకడపు రామాక్రిష్ణ, కుంభం శ్రీనివాస్ రెడ్డి, నాళ్ల శివకుమార్, పిల్లి వెంకన్న, బొడ్డు మహేష్, కుందేళ్ళ చెన్నయ్య, బొలుసాని సత్యనారాయణ, గజ్జె అభినవ్, కోడిదాల శ్రీను, ముచ్చర్ల సైదులు, రాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



# త్రిష మరింత ఎత్తుకు ఎదగాలి

- ప్రపంచ వేదికలో సత్తా చాటడం గర్వకారణం
- సిపిఐ ఆధ్వర్యంలో అభినందన సభ




**విశ్వంభర, భద్రాచలం :** భద్రాచలం ముద్దుబిడ్డ, ప్రపంచ అండర్ 19 క్రికెట్ కప్ విజేత గొంగడి త్రిష మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించి జాతీయ మహిళా ప్రధాన క్రికెట్ జట్టుకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకులు కంభంమెట్టు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలో పుట్టి పెరిగి తండ్రి రామిరెడ్డి అడుగుజాడలలో క్రికెట్ వానమాలు నేర్చుకొని జాతీయస్థాయికి త్రిష ఎదగడం భద్రాచలానికే కాకుండా తెలంగాణకే గర్వకారణం అని అన్నారు.

భారత్ అండర్ 19 జాతీయ జట్టులో శతకం బాది, ఫైనల్ మ్యాచ్ లో కీలక 3 వికెట్లు తీసి జట్టు విజయానికి, ప్రపంచ కప్పు కైవసం చేసుకోవడానికి పాట పడింది అని, సిరీస్, టోర్నీ సాధించింది ఈ దేశం ఆమె వైపు చూసేలా సత్తా చాటిందని చెప్పారు. ఇక్కడ మా కళ్ళముందే బుడిబుడి అడుగులతో నడిచిన త్రిష ప్రపంచ వేదిక పైకి వేగంగా అడుగులు వేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, రాబోయే రోజుల్లో భారత ప్రధాన జట్టులో చోటు సాధించి, ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ నాయుడు, మారెడ్డి శివాజీ, శోభన్, సాయి, మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, గంగాధర్, సాయిరాం, విజయ్ కుమార్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



**విశ్వంభర, హైదరాబాదు :** కేంద్ర బడ్జెట్లో వికలాంగులకు చోటు లేకుండా మంత్రి నిర్మల సీతారామన్ చేశారని గత కొన్ని సంవత్సరాల నుంచి 300 రూపాయలుగా పింఛన్ వస్తున్న దానిలో రూపాయి కూడా పెరగకపోవడంతో వికలాంగుల సమస్యలను మరోసారి విస్మరించినట్టుగా కనిపిస్తుందని, ఇటీవల నే ఢిల్లీలో వికలాంగుల సంక్షేమం జాతీయ అధికారిని కలిసి వికలాంగుల సమస్యలను వారికి దృష్టికి తీసుకువెళ్లిన, మార్పు రాకపోవడం తో కేంద్ర ప్రభుత్వంపై వికలాంగుల సమస్యల పైన జాతీయస్థాయిలో మరో ఉద్యమానికి డెవలప్మెంట్ సొసైటీ ఫర్ డే ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలను చేయనున్నట్టు జాతీయ కన్వీనర్ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కో కన్వీనర్లు భారతి వెంకటేష్ గౌడ్ లు అన్నారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని కార్యాలయం వద్ద మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వంపై మరో ఉద్యమం త్వరలోనే ఉంటుందని ఉద్యమ కార్యచరణ ను త్వరలో ప్రకటిస్తామని అన్నారు. త్వరలో జరిగే వివిధ ఎన్నికల్లో తమ ఓటు హక్కు తో బుద్ధి చెబుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏళ్ల తరబడి జాతీయస్థాయిలో వికలాంగుల సమస్యల పై చిత్తశుద్ధి లేదని కేంద్ర ప్రభుత్వం తీరు మరోసారి బయటపడిందని అన్నారు.

## సోదరి ద్వాదశ దిన కర్మకు హాజరైన కేసీఆర్



**విశ్వంభర, కొంపెల్లి :** మంగళవారం జరిగిన తమ సోదరి చీటీ సకలమ్మ ద్వాదశ దిన కర్మ కార్యక్రమానికి బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు . సోదరి సకలమ్మ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. బి.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్, పలువురు మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు , నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై దివంగత సకలమ్మకు నివాళులర్పించారు .

## జగిత్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఎస్సై కొక్కుల శ్వేత మృతి**



**విశ్వంభర, జగిత్యాల :** బైకు ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు ఘటనలో జగిత్యాల జిల్లా బిసిఆర్బి లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొక్కుల శ్వేత మృతి చెందింది. గొల్లపెల్లి వైపు నుండి జగిత్యాల వస్తుండగా చిలువకోడూరు వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి చెట్టుకు బలంగా ఢీ కొట్టింది. బైకు నడిపిస్తున్న యువకుడుని ఢీకొట్టడముతో యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఎస్ఐ శ్వేతా తో పాటు బైక్ పై ఉన్న వ్యక్తి సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు తెలుస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం రెండు డెడ్ బాడీలను జగిత్యాల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్


**- వేల గొంతులు లక్ష డప్పుల గోడ పత్రిక ఆవిష్కరణ**



**విశ్వంభర, మేడిపల్లి :** జగిత్యాల జిల్లా మేడిపల్లి కేంద్రంలోఎమ్మార్పీఎస్ నాయకులు గౌరవ అధ్యక్షుడు దోనపాల శంకర్ ఆధ్వర్యంలో చలో హైదరాబాదు వేల గొంతుల లక్ష డప్పుల వాల్ పోస్టర్స్, కరపత్రాలను మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్ , తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 7న ఎస్సీ వర్గీకరణ అమలుకై లక్ష డప్పులు వేల గొంతులు మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్రంలో ఉండబడిన ప్రతి జిల్లా ప్రతి మండలం ప్రతి గ్రామం నుండి ఊరికోక బస్సు కుటుంబానికి డప్పుఅనే నినాదంతో ప్రతి ఒక్కరూ లక్షలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాచారం మాజీ సర్పంచ్ చిట్యాల సురేష్. మేడిపల్లి మాజీ ఉపసర్పంచ్ గోస్కే మధు. మోతే రాజన్న. రేవెల్లి గంగాధర్ ఆయా గ్రామాల సంఘ సభ్యుల యూత్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## మిర్చికి 25 వేలు గిట్టుబాటు ధర కల్పించాలి

**- సిపిఐ రాష్ట్ర నాయకులు చంద్ర నరేంద్ర**



**విశ్వంభర, జూలూరుపాడు:** తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మిర్చి పంటకు 25వేల రూపాయలు మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. పాపకొల్లు లో యాసా రోశయ్య అధ్యక్షతన జరిగిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడచిన రెండేళ్లుగా చీడపీడలతో తెగుళ్లతో దెబ్బతిన్న మిర్చి రైతు ఈ సంవత్సరం మిర్చి ధరలు దారుణంగా పడిపోవడంతో దిక్కుతోచని పరిస్థితులలోకి నెట్టి వేయబడ్డాడని అన్నారు. క్వింటాకు 21 వేల దరపలకగా ప్రస్తుతం 14 వేలకు పడిపోయిందని బహిరంగ మార్కెట్లో వ్యాపారులు పదివేల నుంచి 12 వేలకు మించి ధర పెట్టడం లేదని దీనితో మిర్చి రైతాంగం ఒకవైపు పెరిగిన పెట్టుబడులు మరోవైపు తగ్గిన దిగుబడులు ఇంకోవైపు ఆశనిపాతంలా పాతాళానికి పడిపోయిన మిర్చి ధరతో అప్పుల బారిన పడిన రైతాంగం ఆత్మహత్యలే శరణ్యమనే పరిస్థితుల్లోకి వెళ్తున్నారని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని మిర్చి రైతుకు పాతికవేల రూపాయలు మద్దతు ధర కల్పించేలా సరైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## మీర్ తాహేర్ అలీ వీడ్కోలు సమావేశంలో మాజీ ఎమ్మెల్యే

**విశ్వంభర, పరిగి :** మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా 14 వ వార్డు కౌన్సిలర్ మీర్ తాహేర్ అలి కి నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సేవ చేయాలంటే పదవులు అవసరం లేదని, సేవ చేయాలనే సంకల్పం ఉంటే సరిపోతుందన్నారు. 14 వ వార్డు కౌన్సిలర్ మీర్ తాహేర్ అలి చేసిన సేవల వల్ల కాలనివాసులో చెరగని ముద్ర వేశారని అన్నారు. 14 వ వార్డు ఎల్లప్పుడు వార్డు సమస్యల గురించి మాట్లాడేవారని, ఏ సమస్య వున్నా నా దృష్టికి కాని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకుని వచ్చి అది పరిష్కారం అయ్యో విధంగా కృషి చేశారని అన్నారు.



## గ్రేటుఫుల్ హెడ్ సేవ ఫౌండేషన్



**విశ్వంభర, హైదరాబాద్ :** ఈ ఎస్ ఐ హాస్పిటల్ రోగుల అటెండర్ లకు ప్రతి మంగళవారం శుక్రవారం మధ్యాహ్నం భోజనం స్నాక్స్ అందిస్తున్నారు. పౌడర్ బాలు (9676622016) ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే రోజు భోజనం అందించే శక్తి మాకు వస్తుంది. ఈ కార్యక్రమానికి రోజు సహకరిస్తున్న మెంబర్ వెంకటేష్, నాగరాజు, వెంకటేశ్వరరావు, భవాని, ప్రసాద్, యోగేష్, ప్రభు, దాతలు సహకరించాల్సిందిగా కోరారు.

## అష్టలక్ష్మి దేవాలయంలో సూర్యప్రభ వాహన సేవ



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్లోని అష్టలక్ష్మి దేవాలయంలో రథసప్తమి పురస్కరించుకొని వందలాది మంది భక్తుల ఆధ్వర్యంలో సూర్యప్రభ వాహన సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో సూర్యప్రభ వాహన సేవ కార్యక్రమం దేవాలయం పురవీధుల్లో నిర్వహించారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయనుడి భక్తిశ్రద్ధలతో కొలుచుకుంటూ భక్తులు వాహన సేవతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు అయితే అంజయ్య గుప్తా, శ్రీనివాస్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో ముందస్తు నిర్బంధాలను వ్యతిరేకించాలి

**- బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్**




**విశ్వంభర, భద్రాచలం :** అసెంబ్లీ సమావేశం సందర్భంగా అసెంబ్లీ వద్ద ఆందోళనకు బిఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గత రాత్రి 11 గంటల సమయం లో భద్రాచలం మండల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, బిఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మురాల డానియల్ ప్రదీప్, యూత్ కమిటీ మెంబర్ పుట్టి గోపి లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## అన్నదానం మహాదానం : ఉప్పల ప్రవీణ్

**విశ్వంభర, సిద్ధిపేట :** అన్నదానం మహాదానమని కాంగ్రెస్ యువ నాయకుడు ఉప్పల ప్రవీణ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట హనుమాన్ దేవాలయం వద్ద కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్, ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ సౌజన్యంతో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ యువ నాయకుడు ఉప్పల ప్రవీణ్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని గత మూడు సంవత్సరాలుగా ప్రతి మంగళవారం పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టిన హనుమాన్ భక్తబృందం, నోముల మహేందర్ ను అభినందించి ఈరోజు అయిత సత్యనారాయణ తండ్రి కీర్తిశేషులు అయిత నాగయ్య జ్ఞాపకార్థం పులిహోర పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి సేవా భావం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, నోముల మహేందర్, కైలాస ప్రశాంత్,సంతోష్, దుబాకుంట లక్ష్మణ్, మల్యాల వెంకటేశం, శ్రీహరి,విజయ్, రాములు,ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణ హర్షణీయం

**అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ కూడా ఆమోదించాలి : నర్రి స్వామి కురుమ, శ్రీనివాసచారి**



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లో అత్యున్నత న్యాయస్థానం, సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఆల్ బార్ అసోసియేషన్స్ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై. శ్రీనివాస చారి తో కలిసి లాయర్స్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామి కురుమ లాయర్స్ ఫోరం సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ చారి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల సమాచారాన్ని సేకరించి న్యాయవాదులకు సంబంధించిన క్యాలెండర్ ని రూపొందించి ప్రాక్టీస్ చేస్తూనే సామాజిక చైతన్యం కోసం పోరాడుతున్న న్యాయవాది నర్రి స్వామి అభినందనీయులు అన్నారు. లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి మాట్లాడుతూ.. ప్రస్తుత అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చర్చించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా న్యాయవాద ప్రొటెక్షన్ కూడా ఈ క్యాబినెట్ లోనే ఆమోదం తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే రోజుల్లో న్యాయవ్యవస్థలో జడ్జిల నియామకాలలో, బార్ కౌన్సిల్, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించాలని మా లాయర్స్ ఫోరం కోరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ బార్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై శ్రీనివాసులు చారి, ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, జాయింట్ సెక్రెటరీ రమేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి మధుసూదన్, సరిత మిశ్రా , అశోక్ సీనియర్ న్యాయవాదులు నాగభూషణం, హనుమంత్ పటేల్, పరశురాం జూనియర్ న్యాయవాదులు సుమన్ బాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**విశ్వంభర,మాడుగుల:** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతోగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన లక్ష్మణ్ కి గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారం తో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 31,500/రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నిరంజన్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరమళ్ళ సుభాష్ బి ఆర్ ఎస్ నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్లాంటును ప్రారంభించిన మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే



**విశ్వంభర, మిర్యాలగూడ :** ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామములో భోధిధర్మ పీఠం ఆధ్వర్యములో ఆయుర్వేద బయోఎంజైమ్ శుద్ధి చేసే నూతన ప్లాంటును మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ముఖ్యఅతిదిగా పాల్గొని ప్రారంబించారు. అనంతరం క్యాన్సర్ రోగులకు ఉచిత ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు .ఈ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి, నారాయణ రెడ్డి, హాతీరాం నాయక్, ధనావత్ చిట్టిబాబు నాయక్, భోధిధర్మ వ్యవస్థాపకులు పండిట్ శ్రీనివాస్ గురుజి, ఉపేంద్ర గుప్తా, మూశాలి ఖాన్, మునీర్, సుప్రియా, మదన్ మోహన్, సోమారాజు, కీర్తి సంతోష్, భీష్మ తదితరులు పాల్గొన్నారు.


## కమ్యూనిటీ చైతన్యంలో 'ఆశ'లు కీలకం

**జిల్లా వైద్యాధికారి డా.మురళీధర్**



**విశ్వంభర, నెల్లికుదురు:** గ్రామీణ ప్రాంత కమ్యూనిటి చైతన్యంలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా ఆరోగ్య మరియు వైద్యాధికారి గుండాల మురళీధర్ అన్నారు. స్థానిక పిహెచ్సి లో మంగళవారం నిర్వహించిన ఆశా డే లో డిఎం అండ్ హెచ్ ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటీ నేటల్ చెకప్, న్యూట్రిషన్ శానిటేషన్ వంటి కార్యక్రమాలలో ఆశాల సేవలు అపూర్వమన్నారు.అనంతరం వైద్య సిబ్బందికి సూచిస్తూ మహిళల శిశు సంక్షేమ కార్యక్రమాలు, ప్రసూతి,చిన్న పిల్లలకు టీకాలు, టీబీ,లెప్రసీ గర్భిణీ స్త్రీల పరీక్షలు 100% పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.శారద,డా.రమ్య సిహెచ్ శాంతమ్మ,ఇంచార్జ్ డిపిహెచ్ఎన్ఓ మంగమ్మ,పి హెచ్ ఎన్ రజిని సూపర్వైజర్లు వసంత షాహెన్ ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పూస బాలకిషన్



**విశ్వంభర, రామన్నపేట:** మహారాష్ట్ర రాష్ట్రంలోని షోలాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన పూస బాలకిషన్ ఆప్త మిత్రుడు చేతన్ నరోటి కూతురి వివాహ వేడుకలో కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, తుమ్మలగూడెం గ్రామ వాస్తవ్యులు పూస బాలకిషన్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మొబైల్ షో రూంలో చోరీ

**విశ్వంభర, పోచారం:** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో మంగళవారం తెల్లవారుజామున మొబైల్ షోరూం లో చోరీ జరిగింది. అన్నోజిగూడ లో ఉన్న ఎస్ ఎల్ ఎస్ మొబైల్ షోరూంలో 67 సెల్ ఫోన్లు వాటితోపాటు ఎల్ఈడి టీవీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఉదయం షాపు ఓనర్ చూసేసరికి షట్టర్లు పగిలి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీం ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.




## అక్రమంగా చర్చి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ఆర్డీవో గారికి, ఎమ్మార్వో గారికి దాసరిపల్లి గ్రామస్తుల వినతి**



**విశ్వంభర, నర్సంపేట :** అక్రమంగా చర్చి నిర్మాణం చేపడుతున్న చర్చి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాసరిపల్లి గ్రామస్తులు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి గారికి, ఎమ్మార్వో రాజేష్ గారికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం నర్సంపేట మండలం దాసరి పల్లి గ్రామం శివారున పోచమ్మ గుడి సమీపంలో కమ్మపల్లి గ్రామ ఎస్ సి కులస్తులు కొంతమంది చర్చి నిర్మాణాన్ని గ్రామపంచాయతీ పర్మిషన్ లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని తెలుపడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి చర్చి నిర్మాణం ఆపాలని నోటీసులు అందజేశారు. అయినా కూడా వారు లెక్కచేయకుండా చర్చి నిర్మాణం చేపట్టడంతో దాసరిపల్లి గ్రామస్తులు పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేశారు. పోలీస్ శాఖ వారు చర్చి నిర్మాణాన్ని ఆపివేయాలని చెప్పగా వారి ఆదేశాలను సైతం లెక్కచేయకుండా రాత్రికి రాత్రే చర్చి నిర్మాణం చేపడుతూ పైకప్పులు వేయడంతో ఇట్టి విషయం పై నర్సంపేట ఆర్డీవో గారికి, ఎమ్మార్వో గారికి ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు అక్రమంగా చర్చి నిర్మాణం చేపడుతున్న వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసరిపల్లి గ్రామస్తులు దాసరి రాజిరెడ్డి, తోటకూరి ఐలయ్య యాదవ్, వల్లాల శేఖరయ్య తుమ్మ నాగయ్య కొక్కరకొండ బీరప్ప, గంధం రవి, ముద్ద రాజేందర్ యాదవ్ పల్లాల కరుణాకర్, మెరుగు రవీందర్ యాదవ్, సంకటి గణపతి రెడ్డి ముద్దం రవి యాదవ్ వంగ రవీందర్ యాదవ్ సుమారు 150 మంది తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో త్యాగరాజ ఆరాధన వేడుకలు




**విశ్వంభర, సంగారెడ్డి :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో మంగళవారం ప్రముఖ పురాణ స్వరకర్త త్యాగరాజ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని కళలు, ప్రదర్శనా కళల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంగీతం, నృత్యం ద్వారా త్యాగరాజ వైభవం - త్యాగరాజ కృతులు, అనుభూతి, శైలి, ఔన్నత్యాలను మరోసారి మననం చేసుకుని, ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ వేడుకలో గాయకులు డాక్టర్ నిర్మల్ హరీష్, మృదురవళి దర్భల త్యాగరాజ కీర్తనలతో సహా ఆకర్షణీయమైన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డాక్టర్ వై.లలిత సింధూరి, పీబీ వైష్ణవిలు కూచిపూడి, అంజు అరవింద్ భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో త్యాగరాజుకు నివాళులర్పించారు. కాగా, చంద్రకాంత్ మృదంగంపై, మహావాది వాసు విశ్వనాథ్ శాస్త్రి వయోలిన్ తో వారికి సహకారం అందించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**విశ్వంభర , ఆమనగల్లు :** కడ్తాల మండలం ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 198586 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆమనగల్లు మండలం అయ్య సాగర్ క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలు, వివిధ హోదాలలో ఉన్న బాల్య మిత్రులంతా సమ్మేళనంలో కలుసుకొని తమ పాఠశాల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతికి కారణమైన ఆనాటి ఉపాధ్యాయులు పి.యాదయ్య ,వి.సూర్యప్రకాష్, జి .రాంరెడ్డి , బి.మోహన్ సింగ్ లను పూలమాలలు శాలువాలతో సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు చేయూతనందించాలని సేవా కార్యక్రమాలలో తమ వంతు పాలుపంచుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు వీరారెడ్డి, తిరుమలేష్ , వేణుగోపాల్, చంద్రయ్య, గిరిజా, వనజ , యాదయ్య, వేణుగోపాల్ ,రామచంద్రయ్య వెంకటరెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్ ,వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**విశ్వంభర, రామన్నపేట:** సిరిపురం గ్రామంలో శ్రీ భక్త మార్కండేయ స్వామి కళ్యాణోత్సవం ప్రథమ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని, పూజలు చేసి, గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పద్మశాలి ఆరాధ్య దైవమైన శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని తెలియజేయడం జరిగింది. అనంతరం పద్మశాలి సంఘం వారు పూర్ణకుంభం తో స్వాగతం పలుకుతూ శాలువతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, జిల్లా నాయకులు ఎస్కే చాంద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాసరెడ్డి, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు మిరియాల మల్లేశం, అప్పం శ్రీరాములు, కడారి శివ, నల్ల సైదులు, కూనూరు మహేష్, శ్రవణ్, చిరు, మధు పాల్గొన్నారు.

## లక్ష డప్పులు, వేల గొంతులు విజయవంతం చేయాలి



**విశ్వంభర, రామన్నపేట:** ఫిబ్రవరి ఏడవ తారీఖు ఎల్బీ స్టేడియం హైదరాబాదులో జరగబోయే లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఉత్తటూరు గ్రామంలోని ఎం.ఆర్.పి.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మేడిరాజు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తటూరు గ్రామానికి చెందిన యాదవ సంఘం నాయకులు జెట్టి సత్యనారాయణ, జెట్టి సైదులు, జంగిలి అంజయ్య, కుందారపు దానేష, ఉప్పునూతల సైదులు, గౌడ సంఘం నాయకులు చెరుకు సైదులు, గడ్డమీది రాంబాబు, మునుకుంట్ల స్వామి శాలివాహన సంఘం నాయకులు బొడ్డుపల్లి సైదులు, వెలమ సంఘం నాయకులు పోనుగోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మాదిగల న్యాయమైన వర్గీకరణ పోరాటానికి తమ మద్దతు పూర్తి స్థాయిలో ఉంటుందని వర్గీకరణ అమలు కావాల్సిందే అని చెప్పి నాయకులు మాట్లాడడం జరిగింది. 7వ తేదీన జరగబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

## సమాజ్ వాది పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు



**విశ్వంభర, హైదరాబాదు :** త్వరలో జరుగనున్న నల్గొండ వరంగల్ ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సమాజ్ వాది పార్టీ అభ్యర్థిగా ప్రొఫెసర్ వెంకట రాజయ్య ను అదిలాబాద్ కరీంనగర్ మెదక్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ నిమ్మ తోట వెంకటేశ్వర్లు ను ప్రకటిస్తున్నట్లు ప్రొఫెసర్ సింహాద్రి మీడియా సమావేశంలో అన్నాడు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సింహాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జరిపిన కులగనన సర్వేలో ఎస్సీ ఎస్టీ బీసీలను తక్కువ జనాభాగా చూపించిందని మరోసారి ప్రభుత్వం ప్రక్షాళన చేసి ఈ జనాభా పై సరైన నిర్ణయాన్ని తెలియజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసస్తున్నట్లు, అదేవిధంగా అయోధ్యలో దళిత మహిళపై జరిగిన ఘటన లో మృతి కి కారకులైన వారిపైన చట్టపరమైన చర్యల తో వారిని శిక్షించాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో బాబు గౌడ్ స్వరూపరాణి రిజ్వాన్ వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## మాల సంఘాల నేతలు ముందస్తు అరెస్ట్

**విశ్వంభర, వనస్థలిపురం :** తెలంగాణ రాష్ట్రం లో ఎస్సి వర్గీకరణ పై అసెంబ్లీ లో కేబినెట్ సబ్ కమిటీ చర్చిస్తున్న సందర్భంగా మాల సంఘాల రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షులు చేపూరి శంకర్ , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గంగం శివశంకర్, గంగం రాజు ముందస్తుగా హౌస్ అరెస్టు చేసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్టు అనంతరం చేపూరి శంకర్ మాట్లాడుతూ అన్నదమ్ములవలే కలిసి ఉన్న మేము మమ్ములను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కావున ఈ పనులు దయచేసి మానుకొని ప్రజలఅభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది, ఏఎస్ఐ రఘుపతి, కానిస్టేబుల్ జనార్ధన్, హోంగార్డ్ నరేష్, డ్రైవర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



**విశ్వంభర, బోడుప్పల్:** భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నుకోబడిన బుద్ది శ్రీనివాస్ ను ఈస్ట్ జోన్ అధ్యక్షులు పిర్సులు మహేష్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు అధ్యక్షులు శ్రీనివాస్ కి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బోడుప్పల్ ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు కోళ్ళ పూడి విజయలక్ష్మి' రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు బోడుప్పల్ సీనియర్ నాయకులు ఏనుగు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాసాల నరసింగా రావు, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బూషి సంధ్య, జిల్లా కిసాన్ మోర్చ నాయకులు దర్మ రాజిరెడ్డి ,జిల్లా యువ మోర్చ అధికార ప్రతినిధి కిరణ్ గౌడు, ఉపాధ్యక్షులు శరత్ చంద్రారెడ్డి, కిసాన్మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,యువమోర్చ ప్రధాన కార్యదర్శి కొడకండ్ల సత్యం, యువ మోర్చ నాయకులు సురేష్ కుమార్, నాయకులు కాంతా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడికై వెళ్తున్న మాజీ సర్పంచులు ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, త్రిపురారం :** గత ప్రభుత్వ హయాంలో సర్పంచుల పదవీకాలంలో చేసిన మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా వెళుతున్న త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డిని మిర్యాలగూడలో ముందస్తు పోలీసులు అదుపులో తీసుకోవడం జరిగింది. ఇట్టి విషయంపై త్రిపురారం మండల బి ఆర్ఎస్ పార్టీ పలువురు నాయకులు మాట్లాడుతూ ఇటువంటి అక్రమ అరెస్టు అన్యాయం మేం అధికారంలోకి వస్తే పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లిస్తామని మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక పాత బిల్లులు ఇవ్వకపోగా సంవత్సరకాలం లో కొత్త పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ఇదిలా ఉండగా బిల్లుల పరిష్కార నిమిత్తము నిరసన తెలియచేయడానికి వెళ్తున్న సర్పంచ్ లను అరెస్టు చేయడం దారుణం అని అన్నారు.

## శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు



**విశ్వంభర, త్రిపురారం:** రాగడప గ్రామంలో నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ రాగడప నుండి కాపు వారి గూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రారంభించిన శిలాఫలకాన్ని రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటన జరిగింది. ధ్వంసం చేసిన అట్టి స్థలాన్ని త్రిపురారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరిశీలించిన తదుపరి వారు మాట్లాడుతూ.. ఇలా శిలాఫలకాన్ని పగల గోట్టటమనేది నీచమైన దృశ్చర్య.., ఇలాంటి వల్ల జనాలకు ఎలాంటి సందేహం ఇవ్వనున్నారు, ఇలాంటి సంస్కృతి ఇది వరకు ఎప్పుడూ లేదు. అధికారులు గమనించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధానకార్యదర్శి పామోజు వెంకటాచారి, త్రిపురారం మండల మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి,అనుమల శ్రీనివాస్ రెడ్డి ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సీఎం సహాయ నిధి



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మునుగోడు నియోజకవర్గ శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెంధిన కొల్లూరి పద్మ కు 31,000 రూపాయల చెక్కును మాజీ సర్పంచ్ దొనూరు జైపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాలవారి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న నీరుపేదలకు వైద్యానికి అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిది ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సుర్వి ముత్యాలు, ఐఎన్టియుసి మండల అధ్యక్షులు దొల గణేష్, గ్రామశాఖ అధ్యక్షులు కేసాని రాజు, సుర్వి నరేష్, దొల నవీన్, మేకల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, తలకొండపల్లి:** మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో సీతం అంజమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకుర్ ప్రభాకర్ రెడ్డి వారి కుటుంబానికి 3 వేల రూపాయలు గట్టు ఇప్పలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి రెండు వేల రూపాయలు, రేణు రెడ్డి రెండు వేల రూపాయలు, ఆంధ్ర కృష్ణారెడ్డి రెండు వేల రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రకంటి శివ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మిన్నాల డేవిడ్, మాజీ ఉప సర్పంచ్ చంద్రమౌళి, శెట్టి రాజశేఖర్, బొడ్డే కిషన్, సొప్పరి శీను, మట్ట అంజయ్య, ఏదుల మచ్చేందర్, రఫిక్, పవన్ వాల్మీకి, అంజన్ రెడ్డి, సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

**రెడ్డిలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రోడ్డుపై బైఠాయింపు**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ దిష్టిబొమ్మను చౌరస్తాలో రెడ్డి సంఘాల ప్రజాప్రతినిధులు దహనం చేశారు. రెడ్డి సామాజిక వర్గ నాయకులూ, సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రధాన రహదారిపై రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా పెట్టుకొని గత కొన్ని రోజులుగా తీవ్రమైన పరుష పదజాలంతో దూషిస్తున్న నేపథ్యంలో ఇటీవల ఒక సభలో రెడ్డిలపై పరుష వాఖ్యల పట్ల రెడ్డి సామాజిక వర్గ మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను వెంటనే బర్తరఫ్ చేయాలనీ కోరుతూ అలాగే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ప్రముఖ న్యాయవాది రావుల వెంకట్ రెడ్డి , రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నూకల పద్మారెడ్డి పిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో గీతారెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , వెంకట్ రెడ్డి , అంజి రెడ్డి , రెడ్డి సంఘాల ప్రజాప్రతినిధులు , మహిళలు పాల్గొన్నారు.

# కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించండి

### భవిష్యత్తులో నిరవధిక సమ్మె తప్పదు




విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల జీతాలపై ప్రభుత్వం ఏడు నెలలుగా కార్మికుల బిల్లులు చెల్లించకుండా జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్లు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. టీవీవీపీ ఆసుపత్రుల్లో జీతాలకై రోజు ఒక గంట నిరసన ధర్నాలో భాగంగా నేడు హైదరాబాదు కింగ్ కోటి జిల్లా ఆస్పత్రి వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి గత ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొద్ది నెలలు జీతాలు ఇచ్చి అనంతరం చేతులెత్తేసారని కాంట్రాక్టర్లకు, ప్రభుత్వానికి మధ్యలో కార్మికులు నలిగిపోతున్నారని అన్నారు. నెల జీతం మీద పిల్లల చదువులు, ఇంటికిరాయిలకు ఆధారపడినటువంటి కార్మికులు జీతాలు అందక నానా ఇబ్బందులను పడుతున్న జనవరి 27న ఆందోళనకై టీవీవీపీ కమిషనర్ కు నోటీసు ఇచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నా, ప్రభుత్వ అధికారులు చలించటం లేదని ఇలాగే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే రాబోవు రోజుల్లో పనులను పూర్తిగా నిలిపివేసి నిరవధిక సమ్మెకు సైతం వెలనున్నట్లు వారు హెచ్చరించారు. టీవీవీపీ కార్మికుల సమస్యలపై స్పందించి రాష్ట్ర ప్రభుత్వం జీతాలను విడుదల చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో నిరవధిక సమ్మెను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్లు వారు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని పీ.ఎఫ్.సీ ఈఎస్ఐ సక్రమంగా జమ చేయాలని కనీస వేతనాల జీవోలను కార్మికులకు అమలు చేయాలని పెద్దపెట్టున్న నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంతోష, ఎన్ లక్ష్మీ, కౌసల్యమ్మ, అంజమ్మ, ప్రకాష్, గణేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## వేదాద్రి లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు




**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామం లో ఈనెల 7, 8, 9, తేదీలలో జరిగే శ్రీ వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు, ఆమనగల్ సీఐ బి.ప్రమోద్ కుమార్ కి, తలకొండపల్లి ఎమ్మార్వో నాగార్జున కి, ఎంపీడీవో కే.శ్రీకాంత్ కి, తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ కి పీసీసీ సభ్యులు ఆయిల్ శ్రీనివాస్ గౌడ్ కి పీఏసీఎస్ ఛైర్మన్ గట్ల కేశవరెడ్డి కి, బ్రహ్మోత్సవాలకూ రావాల్సిందిగా ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ధర్మకర్త జి శ్రీనివాస్ మూర్తి ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ మల్లెకిడి అంబాజీ, నాయకులు పి అశోక్ బాబు, బి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.


## నూతన బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్‌కు రామన్నపేటలో సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నుకోబడిన, యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలానికి చెందిన వనం అంజయ్యకు మంగళవారం రామన్నపేట పట్టణ కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఇంచార్జ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బట్టే రమేష్, మల్లికార్జునచారి, గట్క శీను, బెల్లి లింగస్వామి, దావనూరి అజయ్, సంతోష్, బెజ్జంకి శివకుమార్, ఏనొత్తుల సురేష్, వీరమల్ల నరసింహ, బతుక్క నరేష్, బొడ్డుపల్లి సైదులు, నరేష్,నల్లబోతు మధు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని బలోపేతం చేయాలి

### వామపక్ష నాయకులు



**విశ్వంభర, ఇనుగుర్తి:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బలోపేతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు మంగళవారం ఆశ డే లో పాల్గొనడానికి వచ్చిన డీఎం అండ్ హెచ్ ఓ డా.గుండాల మురళీధర్ ను కలిసి కోరారు. ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్,ఫార్మసిస్ట్, నర్సులను భర్తీ చేయాలన్నారు.గర్భిణీలకు మందులు,రోగులకు టెస్టులు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.మరుగుదొడ్ల వసతి, ప్రహరీ గోడ నిర్మాణం చేయాలన్నారు.సౌకర్యాలు కల్పిస్తే ప్రైవేట్ దవాఖానాల దోపిడీ తగ్గుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి ఆవుల వెంకన్న ప్రజాపందా డివిజన్ నాయకులు కందాల రంగన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు దుంపల రాజయ్య అమీర్ ఎస్.కె పే శెట్టి ఉప్పలయ్య కందుల శ్రీశైలం మట్టపల్లి హరీష్ పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం




**విశ్వంభర, చేవెళ్ల:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025 26లో 12 లక్షల వార్షిక ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు పన్ను రద్దు చేసిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ యువ నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్లలో ఘనంగా ర్యాలీ తీయడం జరిగింది. తదనంతరం భారతీయ జనతా పార్టీ నాయకులు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్‌పై అవగాహన




**విశ్వంభర, కరీంనగర్ :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఐ ఎమ్ ఏ అసోసియేషన్ సహకారంతో, మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా క్యాన్సర్ వ్యాధి యొక్క లక్షణాలు, తొలి దశలోనే గుర్తించినట్లయితే, చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. ఆరోగ్య మహిళా పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించడం ప్రధానంగా మహిళల్లో వచ్చే 8 రకాల వ్యాధులు అవి క్యాన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మ పోషలోపాలు, మూత్రణాల ఇన్ఫెక్షన్స్, రుతుస్రావ సమస్యలు, మెనూపాస్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ మొదలగు వ్యాధులకు కి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం జరుగుతుందని డా. కె. వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కరీంనగర్ తెలియజేశారు.

## లక్ష డప్పుల, వెయ్యి గొంతుల సభ విజయవంతం చేయాలి

### - మాదిగ జర్నలిస్టుల ఫోరం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** ఎమ్మార్పీఎస్ ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పుల, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు అందుకొని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో గోడపత్రికలను ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎం జె ఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మాదిగ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు జీడిమెట్ల రవీందర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ లక్ష్యసాధన కోసం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా, ప్రతి మాదిగ బిడ్డ గొంతెత్తి డప్పు మోగిస్తూ ముందు ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎఫ్ మండల అధ్యక్షుడు చింత కింది సుధాకర్, ప్రధాన కార్యదర్శి సిరిపంగి బాలరాజు, ఎం జె ఎఫ్ జిల్లా నాయకులు కలకొండ సంజీవ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ముత్యాల చంద్రకాంత్, వలిగొండ యాదయ్య, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ రేవనపల్లి బుగ్గ రాములు, వడ్డేపల్లి వంశీ, చెరుకుపల్లి కృష్ణ, జనగాం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## పేద మధ్యతరగతి ప్రజల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం




**విశ్వంభర, ఆమనగల్:** దేశప్రజలందరికి నచ్చిన మోదీ సర్కార్ వికసిత్ భారత్ 12 లక్షల వరకు ఆదాయం పై పన్ను మినహాయింపు ప్రకటనతో భారత ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి ఆమనగల్లు మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి, రూరల్ బిజెపి అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనువాసు కేకే ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై అటల్ జీ చౌరస్తా లో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మోదీ పాలనలో నే ఆదాయపు పన్ను పై అత్యంత అధిక మినహాయింపు పరిమితులు ఇవ్వబడ్డాయి.మధ్యతరగతి కుటుంబాలు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూసిన కల నెరవేరింది.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం లో రూపొందించిన బడ్జెట్ 2025 26తో మధ్య తరగతి కుటుంబాలపై, ఉద్యోగులపై ఉన్న పన్ను భారాన్ని తగ్గించింది.

12 లక్షల వరకు ఆదాయం పై పన్ను మినహాయింపు ప్రకటనతో కొన్ని కోట్ల మంది ప్రజలు సంబరాలు చేసుకోవడానికి కారణమైన ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి ప్రజలందరి తరపున హార్దిక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ దుర్గయ్య, నాగర్ కర్నూలు జిల్లా బిజెపి కౌన్సిల్ మెంబర్స్ చెక్కల లక్ష్మణ్, మాలే శ్రీశైలం గౌడ్, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్స్ సుందూర్ శేఖర్, బైకని శ్రీశైలం యాదవ్, దుడ్డు కృష్ణ, నాయకులు నాగిళ్ల బుచ్చయ్య, మోక్తాల వెంకటయ్య, జంతుక జానయ్య, గజ్జె ఆనంద్, విష్ణు చారి, పద్మ ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి ప్రతీక ప్రజాపాలన

### -తోట దేవి ప్రసన్న



**విశ్వంభర, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కుల, జనగణకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ మంత్రుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల జనగనన చేపట్టాలని కోరారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నటువంటి టిఆర్ఎస్ బీసీలను పట్టించుకోలేదు, కానీ ఇప్పుడు సవితి తల్లి ప్రేమను వలకబోస్తుంది రిజర్వేషన్కు 33 % ఉంటే దానిని 18% తగ్గించి కెసిఆర్ బీసీలపై వివక్ష చూపించి ఇప్పుడు కవితమ్మ ఏమో బీసీల కోసం ఊక దంపుడు ఉపన్యాసం ఇస్తా ఉన్నది. కానీ కుల జనగణ సర్వే చేయించి బీసీలకు 42% శాతానికి తగ్గొద్దు అని చెప్పినటువంటి ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంత్రి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8న భీష్మ ఏకాదశి


### * విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ మహోత్సవానికి ఏర్పాట్లు

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఈ నెల 8 న భీష్మ ఏకాదశి నాడు భద్రాచలం లో శ్రీ చిన్నజీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగే విరాట్ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ మహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. 15 నుండి 20 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనాతో నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. అందరికీ ఉచితంగా విష్ణుసహస్రనామ స్తోత్ర పుస్తకాలు అందచేస్తారు. పారాయణం పూర్తి అయ్యాక ప్రసాదం పంపిణీ చేస్తారు. గ్రౌండ్ లో జరుగుతున్న ఏర్పాట్లను ఈ రోజు కమిటీ పర్యవేక్షించింది. ఈ కార్యక్రమంలో శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు, వేంకటా చార్యులు, చక్రవర్తి, కమలకుమారి, తాళ్లపూడి రాము, భద్రమారుతి నాగేశ్వరావు, అల్లం నాగేశ్వరరావు, సీతామహాలక్ష్మి, చిట్టే లలిత, వనజమణి పాల్గొన్నారు.



## రామన్నపేట రైల్వే స్టేషన్ లో ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆపాలి

### * కేంద్ర మంత్రి అనుమతి పత్రాన్ని రైల్వే అధికారులకు అందజేత



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట రైల్వేస్టేషన్లో నారాయణాద్రి, ఫలక్ నూమా తదితర ఎక్స్ ప్రెస్ రైళ్లను ఆపాలని రామన్నపేట బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి డాక్టర్ గంగాపురం కిషన్ రెడ్డికి గతంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కేంద్ర మంత్రిత్వ శాఖ ద్వారా తిరిగి అనుమతి లెటరు రావడం జరిగింది. ఈ లెటర్ ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ జైన్ సెక్రటరీ శ్రీనివాస్ మల్లాదికి కేంద్ర మంత్రి ఇచ్చిన లెటర్ ను చూపించడం జరిగింది. నారాయణాద్రి, ఫలక్ నూమా తదితర ఎక్స్ ప్రెస్ రైళ్లను ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం కచ్చితంగా నిలపాలని, గతంలో కరోనా ముందు ఈ రెండు రైళ్ళు ఆగేవని, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వారికి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లపు దుర్గయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు బోనగిరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రన్నింగ్ కారులో మంటలు



**విశ్వంభర, పోచారం:** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పీఎస్ పరిధి అన్నోజిగూడ వద్ద రన్నింగ్ కారులో మంగళవారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. దీంతో పూర్తిగా కారు దగ్ధమైంది. హైదరాబాద్ రాయదుర్గానికి చెందిన సాయి అతని ముగ్గురు మిత్రులతో కలిసి కొమురవెల్లి దర్శనానికి వెళ్తుండగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. దీంతో వారందరూ బయటికి దూకి ప్రాణాలు దక్కించుకున్నారు. షార్ట్ సర్క్యూట్తోనే కారులో మంటలు చెలరేగినట్లు పోలీసులు తెలిపారు.

## మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



**విశ్వంభర, దోమ :** సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సీఎం, మంత్రుల నివాసాల ముట్టడికి తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఐకాస పిలుపు ఇవ్వడం తో మంగళవారం దోమ పోలీసులు సర్పంచుల సంగం నాయకులు రాజిరెడ్డి నీ దోమ మండల కేంద్ర లో పోలీసులు హౌస్ అరెస్ట్ చేసారు. ఈ సందర్భంగా దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష హోదాలో సర్పంచుల పెండింగ్ బిల్లులపై ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలి అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచు లకు ఏడు వందల కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని శాసన సభ సాక్షిగా సంబంధిత మంత్రి పేర్కొన్నారని ఏడాది గడిచిన రూపాయి బిళ్ళ కూడా సర్పంచు లకి చెల్లించలేదని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా ఇరవై కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. చాలా మంది సర్పంచులు అప్పుల పాలు కావటం జరిగిందన్నారు. పది వేల మందికి పైగా సర్పంచు లకు రావాల్సిన బిల్లులు చెల్లించా కే స్థానిక సంస్థల ఎన్నికలు చేపట్టాలి అని ప్రభుత్వాన్ని కోరారు.


## లక్ష డప్పులు వేలాది గొంతుల కరపత్రాలు విడుదల




**విశ్వంభర, భద్రాచలం :** సామజిక న్యాయం కాంగ్రెస్ ధ్యేయం అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. భద్రాచలం పట్టణ కేంద్రం లో లక్షలాది డప్పులు వేలాది గొంతుల కర పత్రాలను ఎక్స్ ఎమ్మెల్యే, పిసిసి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ , డిసిసి ప్రెసిడెంట్ తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గౌరవ పోదెం వీరయ్య గారు ఆవిష్కరించటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్ నడి బొడ్డున జరిగే మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శనను ప్రపంచం మొత్తం మాదిగల వైపు చూసే విదంగా చిర్రలు, చిటికెడు పుల్లలతో డప్పులతో హైదరాబాద్ రాజధాని లో ఎన్నడూ జరగని రీతిలో పెద్దలు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపుకు మాదిగ, మాదిగ ఉప కులాలు ఎర్రని ఎండలో గుండెమీద డప్పు పెట్టి కొట్టడానికి మాదిగలు సిద్ధం కావాలి అని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీని ఎవరు వీడలేదు కేవలం దుష్ప్రచారం

### - మార్కెట్ మాజీ చైర్మన్ గుర్రం కేశవులు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు చంద్రాయనపల్లి తండాలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు పట్టణ అధ్యక్షులు మానయ్య ,కాంగ్రెస్ నాయకులతో పర్యటించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని విడిచి తండాలో ఎవరు బిఆర్ఎస్ పార్టీలో చేరలేదని సోమవారం బిఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారం చేశారని మా కార్యకర్తలు ఎవరు బి ఆర్ ఎస్ పార్టీలో చేరలేదని అన్నారు తండా కు చెందిన నీటి సమస్యను ఎమ్మెల్యేతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. అదేవిధంగా పార్టీలో మంగళవారం పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి గుర్రం కేశవులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు, కార్యక్రమంలో కృష్ణ నాయక్, మల్లేష్ నాయక్, రాగ్య నాయక్, చంద్రు నాయక్, బాలు, కోటి, రమేష్, ఖాదర్ పాల్గొన్నారు.

## వీ3 న్యూస్ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరణ

### * ఆవిష్కరించిన డాక్టర్ చికోటి సంతోష్ కుమార్




**విశ్వంభర, వేములవాడ**: వీ 3 న్యూస్ ఛానల్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను వేములవాడ మాతృశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన వీ 3 న్యూస్ ఛానల్ యజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీ 3 న్యూస్ జిల్లా ఇన్చార్జ్ దెబ్బట్టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే దళితుల అభివృద్ధి

- ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను బీఆర్ఎస్ మింగేసింది
- మొగిలి గిద్ద సభలో ఎస్సీ వర్గీకరణపై మాట్లాడిన సీఎం కు ధన్యవాదాలు



**విశ్వంభర, షాద్ నగర్:** గత పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను నిర్వీర్యం చేశారని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నేతలు కరోల్ల సురేందర్, ఎరోళ్ళ జగన్, జాంగారి రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, సింగపాగ అనిల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకనోళ్ళ శివ, మండల ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, అప్పరెడ్డి గూడ కాంగ్రెస్ నేత చిన్నంతగారి ప్రభు విమర్శించారు. మంగళ వారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సింగ పాగ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ను పట్టించుకున్న పాపాన పోలేదు అని నేతలు అన్నారు. 1975లో ఇందిరాగాంధీ దళిత, గిరిజన వర్గాలకు ప్రత్యేక నిధుల పేరిట కేటాయింపులు చేశారని, ఈ సందర్భంగా గుర్తు చేశారు. అసమాన సమాజంలో వెనుకబడిన కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, వాటిని ఖచ్చితంగా, సక్రమంగా సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నది రాజ్యాంగ సంకల్పం అని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి షెడ్యుల్డ్ కులాలు, షెడ్యుల్డ్ తెగల సంక్షేమం, అభివృద్ధి కొరకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తీసుకువచ్చారనీ, ఈ సబ్ ప్లాన్ ద్వారా జనాభా ప్రాతిపదికన దళిత, గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారనీ బడ్జెట్ కేటాయింపుల్లో నిధులను సబ్‌ప్లాన్‌కు కేటాయించేలా చట్టం కూడా తెచ్చారనీ చెప్పారు. అప్పటి ఉపముఖ్య మంత్రి దామోదర రాజనరసింహ నేతృత్వంలో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి, పలు జిల్లాల పర్యటనల అనంతరం నివేదికనూ సమర్పించారు. దాదాపు రూ.8 వేల కోట్లు ఆ నాటి బడ్జెట్ లో కేటాయించారనీ నేతలు వివరించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దళితుల కోసం వేల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పథంలో నిలిపిన గౌరవం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు.గత బీ ఆర్ ఎస్ హయాంలో దళితులకు జనాభా ప్రకారం ఎస్సీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన బడ్జెట్ నిధులు సైతం ప్రాజెక్టులకు మళ్లించి దళితులను సామాజికంగా, ఆర్థికంగా ఎదగకుండా అనిచివేశారు అని అన్నారు. షాద్ నగర్ నియోజక వర్గానికి 9 కోట్ల 99 లక్షల రూపాయలు, అలాగే ఫరూఖ్ నగర్ మండ లనికి 2 కోట్ల 12 లక్షలు అధిక సంఖ్యలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు




**విశ్వంభర, జూలూరుపాడు:** డా. బీ హరికుమార్ స్కిన్ స్పెషలిస్ట్ నవీన హాస్పిటల్ ఖమ్మం, మరియు శ్రీ పాపిన్ని జనార్దన్ రావు ఆర్థిక సహకారం తో పదవ తరగతి విద్యార్థులు లకి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. పరీక్షలపట్ల భయాన్ని తొలగి, ఒత్తిడిని అధికమించి మంచి మార్కులు సంపాదించే విధంగా, రాష్ట్ర స్థాయి వ్యక్తిత్వ వికాస నిపుణులు సురేంద్ర, సుధీర్, నవీన్, ఖాసిం, వరుణ్ లచే శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. మండలంలో ఉన్న జూలూరుపాడు, పాపకొల్లు , నరసాపురం, నరసాపురం గర్ల్స్, కేజీబీవీ, కాకర్ల స్కూళ్ళో శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా పాపకొల్లు పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు కొద్దుమూరి కోటేశ్వ రావు, ధర్మరాజు ల వెంకట్ నారాయణ యొక్క హార్దిక సహాయంతో మరొక ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో పాఠశాలకు అడ్డుగా వెలసిన గోడ



**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండం మన్నేగుడం గ్రామంలో బీసీ కాలనీ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కు అడ్డుగా గోడ నిర్మాణం చేయడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. 2008 లో కొమిరెడ్డి రాములు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ కాలనీలో ప్రాథమిక పాఠశాల నిర్మించారని అప్పటి నుండి మెయిన్ రోడ్డు నుండి స్కూలుకు వెళ్లడానికి ఈ దారి ఉపయోగిస్తున్నామని, కానీ మంగళవారం ఒక వ్యక్తి వచ్చి ఈ స్థలం నాది ఇందులో నుండి ఎలాంటి రోడ్డు లేదని స్కూలుకు అడ్డుగా గోడ నిర్మించడం అన్యాయం అని కాలనీలోని వాసులంతా కలిసి రోడ్డుమీద బైఠాయించి ఆవేదన వ్యక్తం చేశారు. గత 30సంవత్సరాల నుండి ఈ రోడ్డు వాడుతున్నామని కానీ అతను వచ్చి ఈ స్థలం మాది దీంట్లో రోడ్డు లేదు అని తెలియడంతో కాలనీ వాసులు ఆందోళనకు చెందారు. మా పిల్లలను స్కూలుకు పంపాలంటే ఇబ్బంది అవుతుంది అని, ప్రజలు ఆవేదనను వ్యక్తపరిచారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన టీఎన్జీవోస్ నేతలు



**విశ్వంభర, బషీర్ బాగ్:** అసిస్టెంట్ కమీషనర్ జూపల్లి నర్సింగ్ రావు కుమారుడు శ్రీకాంత్, ప్రియాంక ల వివాహ విందు కేవీఎంఆర్ ఫ్రైడ్ గార్డెన్ వైఎస్ఆర్ సర్కిల్ నార్సింగ్ గండిపేట్ లో అంగరంగ వైభవంగా జరిగింది. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రెసిడెంట్ మర్రం జగదీష్, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్ ఎం హుస్సేని ముజీబ్, వైస్ ప్రెసిడెంట్ నజీర్ టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ , టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, సెక్రటరీ ఎం. భాస్కర్ లు నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వదించారు. వారితోపాటు సత్యనారాయణ, బషీర్, యోగి, శేఖర్, జంబయ్య ఐజాజ్, నజీర్, మీర్జా, సమద్, మురళి, అల్తాఫ్, షాబుద్దీన్, మధుకర్, రాకేష్, శంకర్ పాల్గొన్నారు.

## పటేల్ రమేష్ రెడ్డి ని కలిసిన సుఖేందర్ రెడ్డి, నరేందర్


**విశ్వంభర, హైదరాబాద్:** మంగళవారం పందెం సుఖేందర్ రెడ్డి, రాజల నరేందర్ జన్మదిన సందర్భంగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారికి పటేల్ రమేష్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డి, చందన్, రాజ శేఖర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, దేవేందర్, నితిన్, వినయ్ కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

*గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి

- బీజేపీ అధ్యక్షురాలు రొల్లు రాధిక




**విశ్వంభర, కేశంపేట్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈనెల 1న ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వరుసగా 8వ సారి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ 202526 పేదలు, అణగారిన వర్గాలు, రైతులు, మహిళలు, యువకులు అందరికీ ఎంతో మేలు చేసే విధంగా ఉందని అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యంగా వార్షిక ఆదాయపు పన్ను 12 లక్షలకు పెంచడం ద్వారా వేతన జీవులకు భారీ ఊరట కలిగిందని అన్నారు. ప్లాట్ ఫామ్ వర్కర్స్ కి ఉచిత బీమా సదుపాయం కల్పించడం ద్వారా మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తుందని అన్నారు. భారత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ బడ్జెట్లో 1.45 కోట్ల రూపాయలు కేటాయించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం కోసం అనేక సంస్కరణలు తీసుకురానుందని అన్నారు. దీనికిగాను కిసాన్ క్రెడిట్ కార్డు లిమిట్ 3 లక్షల నుండి 5 లక్షలకు పెంచిందని, వ్యవసాయ ఉత్పాదకత తక్కువగా ఉన్న 100 జిల్లాలలో దిగుబడి పెంచే విధంగా ప్రధానమంత్రి ధనధాన్ కృషి యోజన పథకం కోసం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడం శుభ పరిణామం అన్నారు. చీడపీడలను తట్టుకునే అధిక దిగుబడి నిచ్చే కొత్త వంగడాలను అభివృద్ధి చేసేందుకు జాతీయ కమిషన్ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రధానమంత్రి ప్రకటించిన విధంగా కిసాన్ సమ్మాన్ నిధికి 60 వేల కోట్ల రూపాయలు కేటాయించి రైతుల ఖాతాలను ప్రతి సంవత్సరం 10,000 ల రూపాయలు రైతు పెట్టుబడికి జమ చేయనున్నారు. దేశంలోని 50 వేల పాఠశాలలో అటల్ టింకరింగ్ యోజన ద్వారా బ్రాడ్బండ్ సేవలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానుందని అన్నారు. కాంగ్రెస్ ఇప్పటికైనా డైవర్షన్ పాలిటిక్స్ మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని లేదంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

## కుల గణనతో బహుజనులను అణచి వేసే కుట్ర

* సర్వేను తిరస్కరించిన బీఎస్పీ నేత దొడ్డి శ్రీనివాస్



**విశ్వంభర, షాద్ నగర్:** బహుజన్ సమాజ్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గం లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన కుల గణనను తిరస్కరిస్తూ మంగళవారం బీఎస్పీ పార్టీ ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 2014 సంవత్సరంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే పేరుతో చేసిన గణాంకాలకు, నేడు రేవంత్ రెడ్డి నేతృత్వంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గణంకాలకు పొంతనలేదని ఈ సర్వేను తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. 2014లో నుండి 2024 వరకు అగ్రకులాల జనాభా 5 శాతానికి పైగా జనాభా పెరిగినట్లు లెక్కలేశారని, బీసీ జనాభాను మాత్రం 5 శాతం తగ్గినట్లు లెక్క చూపారన్నారు. ఇది బీసీలను అణచి వేసే కుట్ర అని అనుమానం వ్యక్తం చేశారు. సమగ్ర కుటుంబ సర్వేలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా నేడు జరిగిన 17 శాతం గా తగ్గిస్తూ తప్పుడు లెక్కలు చెప్పారన్నారు. అగ్రకులాలలో సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా విద్య ఉపాధి పరంగా ఎస్సీ ఎస్టీ బీసీలు ఏ విధంగా నష్టపోతున్నారో ఈ సర్వే తెలుపలేదన్నారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికలలో ఇచ్చిన హామీలకు తూతూ మంత్రంగా సర్వే చేపట్టి 85 శాతం ఉన్న బహుజనులకు అన్యాయం చేశారని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం తెచ్చుకున్నారని, ఏడు శాతం ఉన్న జనాభాకు ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ ఎట్లా వర్తిస్తాయో ప్రజలు కుట్రను గుర్తించాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు కుల ఉద్యమాలతో పాటు రాజకీయ వాటాలను పెంచే ఉద్యమాలను బలోపేతం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. త్వరలో ఈ విషయంపై కార్యక్రమాలు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ అధ్యక్షులు సొంటె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తుప్పరి కుమార్, నియోజవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ కొండేటి మహేందర్, ఫరూక్నగర్ మండల అధ్యక్షులు శివగల ఆంజనేయులు, షాద్ నగర్ మున్సిపాలిటీ అధ్యక్షులు నీరటి రాజు, తదితరులు పాల్గొన్నారు.


## ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రానున్న శాసనమండలి, (ఎమ్మెల్సీ) పంచాయితీ, ఎంపీటీసీ, ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని (482) గ్రామపంచాయతీలు, (4110) వార్డుల వారీగా ఓటరు జాబితా సవరణలు అభ్యంతరాలు గ్రామ పంచాయతీ, వార్డు పోలింగ్ బూత్ లు, వివిధ అంశాలపై వారితో చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. జిల్లాలోని రెండవ ఓటరు సవరణ జాబితా ఓటరు సవరణలపై మంగళవారం, బుధవారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అట్టి వివరాలను సేకరిస్తామన్నారు. అలాగే జిల్లాలోని (193) ఎంపీటీసీల స్థానాల వివరాల గురించి చర్చించారు. ప్రభుత్వ నిబంధనలు, ఎన్నికల ఆదేశాల మేరకు షెడ్యూలు ప్రకారము జిల్లాలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి, జడ్పీ సీఈవో పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, భారత రాష్ట్ర సమితి నుండి మారినేని వెంకన్న, సీపీఐ పెరుగు కుమార్, కలెక్టరేట్ సూపరిండెంట్ మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రైతు పిట్ల లింగం ఇటీవల ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబ సభ్యులను బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, రసమయి బాల కిషన్ పరామర్శించారు. రుణమాఫీ కాక రైతు భరోసా డబ్బులు రాక వ్యవసాయానికి చేసిన అప్పులు తీరక అనేక మంది రైతులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన రైతు పిట్ల లింగం ఇటీవల ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబ సభ్యులను బి.ఆర్.ఎస్ పార్టీ కి చెందిన రైతు ఆత్మహత్యల కమిటీ సభ్యులు కుటుంబాన్ని పరామర్శించారు. పిట్ల లింగం కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రానున్న రోజుల్లో వారి పిల్లలకు, కుటుంబానికి అండగా ఉంటామని 1లక్ష రూపాయలు తక్షణ సహాయం ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రోజుకు ఒక రైతు చొప్పున 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే అధికారంలో ఉండి ఏం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భవిష్యత్తులో స్నహాయ సహకారాలు అవసరం ఉన్న అండగా ఉంటామని తెలిపారు.

## శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామివారి ఆశీర్వాదం తీసుకున్న దేప



**విశ్వంభరం, మహేశ్వరం:** మహేశ్వరం మండలం కోళ్ల పడకలు గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ్మ అందాలు ఆధ్వర్యంలో కనుల పండుగగా జరిగింది. ఈ కళ్యాణానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి హాజరై స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడి కమిటీ మెంబర్లు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ హరికిషన్ గౌడ్ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి మాజీ ఎంపీటీసీ హనుమ గళ్ళ చంద్రయ్య, భాస్కర్ గౌడ్, అనంతరెడ్డి, కట్టెల శేఖర్, ఐ నరసింహ గౌడ్, సత్యానారాయణ, బండ బిక్షపతి, ప్రభాకర్ రెడ్డీ, తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జీ పనులను పర్యవేక్షించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్



**విశ్వంభర, షాబాద్:** షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో చిన్న వాగు పనులు ప్రారంభం అయ్యాయి బ్రిడ్జి పన్నులు సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి పర్యావేక్షించారు. బ్రిడ్జి కాంట్రాక్టర్ తో మాట్లాడుతూ పనులను వేగవంతంగా బ్రిడ్జ్ పనులను చేయాలని, అలాగే నాణ్యత పరిమాణం బాగుండాలని ఆయన తెలిపారు. ఈ బ్రిడ్జ్ పూర్తయితే వికారాబాద్ వరకు ప్రయాణం సాగించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి వేణుగోపాల్, పీసరి జగన్మోహన్ రెడ్డి, బొంతపల్లి వీరేందర్ గుప్తా, మాజీ ఎంపీటీసీ ఉమ్మెత్తల గోపాల్ యాదవ్, వార్డ్ మెంబర్ రాజేందర్ రెడ్డి, నాయకులు సర్దార్, కుమ్మరి శ్రీనివాస్, మల్లెపల్లి నరేందర్ రెడ్డి, పట్లోళ్ల సాయినాథ్ రెడ్డి, బొబ్బిలి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై డీజీపీకి పిర్యాదు



**విశ్వంభర, హైదరాబాద్:** ఎమ్మెల్సీ, తీన్మార్ మల్లన్నపై డీజీపీ కి తెలంగాణ రెడ్డిసంఘాల నేతలు పిర్యాదు చేశారు. వరంగల్ లో జరిగిన బీసీ సభలో తీన్మార్ మల్లన్న తీవ్ర పదజాలంతో రెడ్డి కులాన్ని దూషించడం పై తెలంగాణ రెడ్డిసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్డి కులాన్ని కించపరిచే వ్యాఖ్యలపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలిని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న రెడ్డి కులానికి క్షమాపన చెప్పి, తన వ్యాఖ్యలను వెనిక్కి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని రెడ్డి సంఘం రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సురేందర్ రెడ్డి, విజితా రెడ్డి, సరితా రెడ్డి, ఊర్మిళా రెడ్డి, సమతా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం



**విశ్వంభరం, నాగారం:** ఓటు హక్కును ప్రతి ఒక్క సద్వినియోగపర్చుకోవాలి అని నాగారం మండల ఎంపీడీవో మారయ్య అని అన్నారు. మంగళవారం నాగారం మండల పరిషత్ కార్యాలయం నందు పలు రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం గ్రామ పంచాయతీల వారీగా నూతన ఓట్లు చేర్చిన ఓటర్ లిస్ట్ పై వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు కార్యదర్శులతో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల దృష్ట్యా ఓటర్ లిస్టు లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల బుచ్చిబాబు, కూరం వెంకన్న, ఎర్ర రాంబాబు, కడియం కుమార్, నవీన్ లింగయ్య, యాదయ్య, బాలరాజు, యాకూబ్ వలి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సర్వదు పాషా, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలములో గల 13 ఎంపీటీసీ నియోజకవర్గ ఎన్నికలకు గాను రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశానుసారం ఫైనల్ నోటిఫికేషన్ ప్రచురణ తర్వాత మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో కొత్తగా ఏర్పాటు అయిన సిరిగిరి పూర్ ఎంపీటీసీ నియోజకవర్గం పైన ఏమైనా అభ్యంతరాలు స్వీకరించుటకై సమావేశం నిర్వహింవహించటం జరిగింది. ఈ సమావేశములో శైలజ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ ఎస్ ఎం టి నవతా, పర్యవేక్షకులు పద్మ శ్రీ వివిధ రాజకీయ పార్టీ ల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.





## రాహుల్ 'చైనా ఎంట్రీ' వ్యాఖ్యలు..
# రాజ్‌నాథ్ సింగ్ ఫైర్

**ఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మండిపడ్డారు. భారత్- చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ వ్యాఖ్యలు చేయడంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నేత తప్పుడు ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్-చైనా సరిహద్దు పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ చేసిన ప్రకటనపై రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రసంగంలో తప్పుడు ఆరోపణలు చేశారంటూ రాజ్‌నాథ్ సింగ్ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. ''ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆయన బాధ్యతారహిత రాజకీయాలకు పాల్పడడం విచారకరం. ఆయన చరిత్రపై అవగాహన పెంచుకోవాలి'' అంటూ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో రాహుల్ గాంధీ.. భారత్ భూభాగాలు, మేకిన్ ఇండియా గురించి ప్రస్తావించారు. ''చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయనే విషయాన్ని ప్రధాని మోదీ ఖండించారు. దీనిపై ఆర్మీ చీఫ్ వాస్తవం మాట్లాడారు. చైనా బలగాలు మన భూభాగంలో ఉన్నాయని ఆయన అన్నారు'' అని రాహుల్ అన్నారు. అదే విధంగా తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీ చేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# చిన్నారి వీడియో వైరల్.. అంగన్వాడీ మెనూలో మార్పు చేయనున్న మంత్రి!




**తిరువనంతపురం:** బుజ్జిబుజ్జి మాటలతో ఓ చిన్నారి చేసిన రిక్వెస్ట్ నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇది కాస్త మంత్రి దృష్టికి చేరడంతో ఆమె స్పందించారు. దానిని ఆమె ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు. ఇంతకీ విషయం ఏంటంటే..? ''అంగన్వాడీలో ఉప్మాకు బదులు బిర్యానీ, చికెన్ ఫ్రై కావాలి'' అని కేరళకు చెందిన శంకు అనే చిన్నారి తన తల్లిని అడుగుతున్న వీడియో ఆన్‌లైన్‌లో చక్కర్లు కొట్టింది. ఇంట్లో బిర్యానీ తింటూ పిల్లాడు ఈ కోరిక కోరాడు. ఆ ముద్దుముద్దు మాటలను తల్లి వీడియో తీసి, పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. ఇది కాస్తా మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి వీణా జార్జ్ (Veena George) దృష్టికి చేరింది. దానిని ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ''ఇప్పుడు పెడుతోన్న ఆహారాన్ని ఒకసారి పరిశీలిస్తాం. పోషకాహారం అందేలా ప్రస్తుతం వివిధ రకాల పదార్థాలను అందిస్తున్నాం. ఈ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ ద్వారా గుడ్లు, పాలు అందించే పథకం విజయవంతంగా అమలవుతోంది'' అని మంత్రి మాట్లాడారు. ఇక శంకు వీడియోను చూసి నెటిజన్లు ముచ్చటపడ్డారు. అంగన్వాడీ పిల్లలకు మరింత మెరుగైన ఆహారం అందించాలని కోరారు.

# తిరుపతి డిప్యూటీ మేయర్‌గా టీడీపీ అభ్యర్థి మునికృష్ణ ఎన్నిక




**విశ్వంభర, తిరుపతి:** తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా టీడీపీ అభ్యర్థి మునికృష్ణ ఎన్నికయ్యారు. మునికృష్ణకు 26 మంది, వైసీపీ అభ్యర్థి భాస్కర్‌రెడ్డికి 21 మంది మద్దతు తెలిపారు. దీంతో మునికృష్ణ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. సోమవారం డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా.. కోరం లేకపోవడంతో మంగళవారం వాయిదా పడింది. తిరుపతి నగరపాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లకుగాను ప్రస్తుతం 47 మంది ఉన్నారు. తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి వైకాపా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. మొత్తంగా 50 మంది సభ్యులకుగాను సగం మంది (25) హాజరు కావాల్సి ఉండగా.. ఎమ్మెల్యే ఆరణితో కలిసి 22 మందే రావడంతో కోరం లేదని సోమవారం అనివార్యంగా ఎన్నికను వాయిదా వేశారు. దీంతో నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగింది.

# ఏపీలో 3 కమిటీలకు చైర్మన్‌ల నియామకం..

### నోటిఫికేషన్ జారీ చేసిన స్పీకర్



**విశ్వంభర, అమరావతి:** ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల చైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం చైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ చైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ఫైనాన్షియల్ కమిటీలకు చైర్మన్‌లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైనాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించారు.

# అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపేయండి

## అస్సాం ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం



**ఢిల్లీ:** అస్సాం ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా రాష్ట్రంలోకి వచ్చిన విదేశీయులను వెంటనే పంపివేయకుండా నిర్బంధ కేంద్రాల్లో నిరవధికంగా ఉంచడంపై మండిపడింది. వారిని స్వస్థలాలకు పంపడానికి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారా అని ప్రశ్నించింది. నిర్బంధ కేంద్రాల్లో ఉంచిన 63 మందిని రెండు వారాల్లోగా పంపించేయాలని న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఎవరైనా దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవారని తెలిసినప్పుడు వారిని పంపివేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. నిర్బంధంలో ఉన్న విదేశీయులను వారి దేశాలకు పంపించమంటే వారి చిరునామా తెలియదని పేర్కొంటూ మీరు తరలింపు ప్రక్రియను ప్రారంభించడానికి నిరాకరిస్తున్నారు. అది మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశంకాదు. అలాగే వారిని జీవితాంతం కేంద్రాల్లో ఉంచి పోషించలేం కదా..వెంటనే వారిని వారి దేశాలకు తరలించండి. దానికి ఏమైనా ముహూర్తంకోసం ఎదురుచూస్తున్నారా..?'' అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అస్సాంలో ఉన్న అన్ని నిర్బంధ కేంద్రాల నుంచి ఇప్పటి వరకు ఎంతమందిని వారి దేశాలకు పంపించారన్న నివేదికలను సమర్పించాలని ఆదేశించింది. అస్సాం సహా మరికొన్ని రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు పెద్దయెత్తున పెరిగిపోవడంతో స్థానికుల్లో అభద్రతాభావం అధికమవుతోంది. తమ వనరులు పొరుగు దేశస్థుల పాలవుతున్నాయని... తాము మైనారిటీలుగా మారే ముప్పుందని వారు వాపోతున్నారు. వలసదారుల్లో కొందరు మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రతకు ముప్పుగానూ పరిణమిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వారిని తమ దేశాలకు పంపడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం పైవిధంగా స్పందించింది.

## రాహుల్‌పై సభా హక్కుల ఉల్లంఘన
# నోటీసులకు సిద్ధమవుతున్న బీజేపీ



**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ ఎంపీలు యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో రాహుల్ మాట్లాడుతూ పదేపదే చైనా పేరును ప్రస్తావించిన విషయం తెలిసిందే. కాగా ఆయన చెప్పేవన్నీ అబద్ధాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించడంతో లోక్‌సభలో వాతావరణం వేడెక్కింది. రాహుల్ తాను చేసిన ఆరోపణలకు సంబంధించి సరైన ఆధారాలు అందించడంలో విఫలమైతే ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ పై బీజేపీ ఎంపీలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభోపన్యాసం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ అభ్యంతరకర పదాలు వాడినందువల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ గాంధీ .. తయారీ రంగంలో భారత్ కంటే చైనా పదేళ్లు ముందుందన్నారు. ఆ దేశానికి చెందిన మోటార్లు, బ్యాటరీలు, ఆప్టిక్స్‌ల దిగుమతులపై ఇప్పటికీ భారత్ ఆధారపడటాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రధాని మోదీ చేపట్టిన 'మేకిన్ ఇండియా' విఫలం కావడం వల్లే బీజింగ్ నుంచి వస్తువులు దేశంలోకి వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# కుంభమేళా మృతుల సంఖ్య ఎందుకు దాస్తున్నారు?



అఖిలేశ్ యాదవ్

**ఢిల్లీ:** అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళాలో ఇటీవల తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్యను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం దాచిపెడుతోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం పార్లమెంటులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వం నిరంతరం బడ్జెట్ గణాంకాలు ఇస్తూనే ఉంది. అదేవిధంగా.. మహాకుంభమేళాలో మరణించిన వారి గణాంకాలు సైతం ఇవ్వాలి. అక్కడి ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. కుంభమేళా నిర్వహణ బాధ్యతలు ఆర్మీకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నా. మృతుల సంఖ్య, క్షతగాత్రులకు అందించిన వైద్యం, మందులు, ఆహారం, రవాణా వంటి అన్ని వివరాలను పార్లమెంటులో సమర్పించాలి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిజాన్ని దాచిన వారిని శిక్షించాలని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని కోరుతున్నాం. నేరం లేకుంటే ఆ గణాంకాలను ఎందుకు దాచారు?.' అని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు. మహా కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. సంగం ఘాట్ వద్ద చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు.

## మహిళలు ఫిర్యాదుకు వెళ్తే..
# ఆత్మహత్య బెదిరింపులు

### మస్తాన్ సాయి కేసులో కొత్త కోణాలు



**విశ్వంభర, హైదరాబాద్:** యువతుల ప్రైవేటు వీడియోలను సేకరించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో అరెస్టయిన ఏపీకి చెందిన రావి మస్తాన్ సాయి కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధిత మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తుంటే బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ఫ్యాన్‌కి ఉరి బిగించుకుని ఏడుస్తూ వీడియో కాల్స్ చేసినట్లు సమాచారం. సుమారు 100 మందికి పైగా మహిళలను ఇలా మోసగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రికార్డ్ చేసిన వీడియోలతో బ్లాక్ మెయిల్ చేసి పలుమార్లు అత్యాచారం చేసినట్లు దర్యాప్తులో తేల్చారు. యువతులను మస్తాన్ సాయి అసభ్యంగా తిడుతూ మానసిక క్షోభకి గురిచేసినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడిని మరోసారి కస్టడీకి తీసుకొని విచారణ చేయనున్నారు. మస్తాన్ సాయి బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.యువతులు, వివాహితలకు డ్రగ్స్ ఇచ్చి, లైంగికవాంఛ తీర్చుకుంటూ వీడియోలను చిత్రీకరిస్తున్నాడని విజయవాడకు చెందిన మన్నేపల్లి లావణ్య(32) ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి ఠాణాలో కేసు నమోదైన విషయం తెలిసిందే. మస్తాన్‌సాయి గతంలో హైదరాబాద్, విజయవాడలో నమోదైన డ్రగ్స్ కేసుల్లో నిందితుడు. సినీ నటుడు రాజ్‌తరుణ్ తనను పెళ్లి పేరిట మోసగించాడని లావణ్య గతంలో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వివాదంలోనే మస్తాన్‌సాయి వ్యవహారం బయటకొచ్చింది.



# నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి మండవ కృష్ణకుమారి

**విశ్వంభర, నందిగామ:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు లభించింది. వైసీపీ అభ్యర్థి ఓర్సు లక్ష్మికి కేవలం ముగ్గురే మద్దతు తెలిపారు. దీంతో చైర్‌పర్సన్‌గా కృష్ణకుమారి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆర్డీవో బాలకృష్ణ ఆమెకు అందజేశారు.2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ-13, టీడీపీ-6, జనసేన-1 చొప్పున గెలిచారు. ఆ తర్వాత టీడీపీ నుంచి ఒకరు వైసీపీలో చేరారు. చైర్‌పర్సన్‌గా వైకాపా నుంచి మండవ వరలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్‌గా మాడుగుల నాగరత్నం ఎంపికయ్యారు. ఆ తర్వాత వీరు చనిపోయారు. ప్రస్తుతం ఏడుగురు కౌన్సిలర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో టీడీపీ బలం 5 నుంచి 12కు పెరిగింది. జనసేనతో కలిపితే 13. ఎమ్మెల్యేతో కలిపి 14 ఓట్లు ఉన్నాయి. వైకాపాలో ఐదుగురు మిగలగా.. వీరిలో ఒకరు రాజీనామా చేయడంతో నలుగురే మిగిలారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌తో కలిపి ఆ పార్టీకి ఐదు ఓట్లున్నాయి. తాజాగా జరిగిన చైర్‌పర్సన్ ఎన్నికలో వైకాపాకు కేవలం ముగ్గురే మద్దతు తెలపడం గమనార్హం.

# తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓటమి: మాజీ మంత్రి రోజా



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్‌కే రోజా తీవ్రంగా స్పందించారు. మంగళవారం జరిగిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో అధికార కూటమికి చెందిన ప్రభుత్వ నాయకుల దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యం ఓటమి పాలయ్యిందని ట్విటర్ వేదికలో ఆరోపించారు.పోలింగ్ కేంద్రానికి వైసీపీ కార్పొరేటర్లతో వస్తున్న ఎంపీ గురుమూర్తి బస్సుపై రాళ్లతో దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు, కిడ్నాపులతో తిరుపతిలో అరాచకం సృష్టించారని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఎన్నికలకు వైసీపీ విప్ జారీ చేసిందని, కూటమికి ఒకే కార్పొరేటర్ ఉంటే డిప్యూటీ మేయర్ పదవి ఎలా సాధ్యమయ్యిందని ప్రశ్నించారు. విప్ ధిక్కరించిన వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అంతిమంగా ఒకటే చెపుతున్నామని, `మేము ఓడి గెలిచాం.. వారు గెలిచి ఓడిపోయారు`ని అన్నారు. వైసీపీ ఓడిపోలేదు.. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం గెలిచిందని పేర్కొన్నారు. తిరుపతిలో జరిగిన అప్రజాస్వామిక ఎన్నికను ఏడుకొండలపై ఉన్న వెంకన్న స్వామితో పాటు ప్రజలు గమనిస్తున్నారని , సమయం వచ్చినప్పుడు కచ్చితంగా వారు సమాధానం చెపుతారని అన్నారు.

# మన్మోహన్ సింగ్ స్మారక నిర్మాణానికి భూమి కేటాయింపు..!



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ డిసెంబర్‌లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన స్మారకం ఏర్పాటు కోసం కేంద్రం భూమి కేటాయించిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ఇచ్చిన స్థలం పక్కనే ఉన్న ఈ భూమిని సింగ్ కుటుంబ సభ్యులకు ఇచ్చిందని పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ కోసం సింగ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్న ట్రస్ట్ కోసం ప్రభుత్వం వేచి చూస్తోందని మీడియా కథనాలు తెలిపాయి.ఒకసారి అది ఏర్పాటైన తర్వాత ఆ స్థలాన్ని అప్పగించనుంది. అంతేగాకుండా నిర్మాణం నిమిత్తం రూ.25 లక్షలు ఇవ్వనుంది. దిల్లీలోని రాజ్‌ఘాట్ ప్రాంగణంలోని రాష్ట్రీయ సమితి కాంప్లెక్స్‌లో ప్రణబ్ ముఖర్జీ స్మారకం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ విషయాన్ని గత నెల ఆయన కుమార్తె శర్మిష్ఠముఖర్జీ ధ్రువీకరించారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# విరాట్ వికెట్.. బస్సు డ్రైవర్ సలహా విని షాకయ్యా!



## హిమాన్షు సంఘ్వాన్

**ముంబయి:** పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్న విరాట్ కోహ్లీ మునపటి జోరు అందుకోవడానికి దాదాపు 12 ఏళ్ల తర్వాత రంజీ మ్యాచ్ ఆడాడు. రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించింది. కానీ, ఒకేఒక్క ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మాత్రం ఆరు పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. రైల్వేస్ బౌలర్ హిమాన్షు సంఘ్వాన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ వికెట్ తీయడంతో హిమాన్షు సంఘ్వాన్ వార్తల్లో నిలిచాడు. అయితే, విరాట్ వికెట్ ఎలా తీయాలో తమ జట్టు బస్సు డ్రైవర్ తనకు సూచనలు చేశాడని హిమాన్షు పేర్కొన్నాడు. 5వ స్టంప్‌లైన్‌లో బౌలింగ్ చేయాలని సూచించినట్లు తెలిపాడు. బస్సు డ్రైవర్ సూచనలకు తాను షాకయ్యానని.. కోహ్లీ బలహీనతలపైనే కాకుండా తన బలాలపై దృష్టిపెట్టి బౌలింగ్ చేసినట్లు హిమాన్షు వివరించాడు. కోహ్లీ కొంతకాలంగా ఆఫ్‌సైడ్ అవల పడిన బంతులను ఆడటంలో ఇబ్బంది పడుతున్నాడనే విషయం తెలిసిందే.

'మ్యాచ్‌కు ముందు ఢిల్లీ జట్టులో విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్ ఆడుతున్నారని చెప్పారు. కానీ, పంత్ ఆడలేదు. మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం అవుతుందని ఆ సమయంలో మాకు తెలియదు. తర్వాత ఆ విషయం తెలిసింది. రైల్వేస్ పేస్ విభాగాన్ని నేను ముందుండి నడిపిస్తున్నా. క్రమశిక్షణతో బౌలింగ్ చేయాలని కోచ్‌లు సూచించారు. నేనే కోహ్లీ వికెట్ తీస్తానని జట్టులోని ప్రతిఒక్కరూ చెప్పారు. బస్సు డ్రైవర్ కూడా కోహ్లీకి నాలుగు లేదా ఐదో స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేయాలని సూచించాడు. కానీ, నాపై నాకు నమ్మకం ఉంది. అవతలి వాళ్ల బలహీనతలపై కాకుండా నా బలంపై దృష్టి పెట్టాలనుకున్నా. అలాగే బౌలింగ్ చేసి కోహ్లీని ఔట్ చేశా' అని సంఘ్వాన్ వివరించాడు.

**ప్రత్యేకంగా ప్లాన్ చేయలేదు**

'విరాట్ కోహ్లీని ఔట్ చేయడానికి ప్రత్యేకంగా ప్లాన్ చేయలేదు. మా ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్నప్పుడు కోహ్లీతో కలిసి చేతులు కలిపి మాట్లాడాను. బాగా బౌలింగ్ చేశావని కోహ్లీ అభినందించాడు. లంచ్ బ్రేక్‌లో ఫొటో దిగుతానని చెప్పాను. కోహ్లీని ఔట్ చేసిన బంతి తీసుకొని ఢిల్లీ డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లి అతడితో కలిసి ఫొటో దిగాను' అని హిమాన్షు తెలిపాడు.

# ది బెస్ట్ ఇవ్వాలని ముందు నుంచే కష్టపడ్డా!

## గొంగడి త్రిష



**ముంబయి:** మలేసియాలో జరిగిన అండర్19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలవడంపై క్రికెటర్ గొంగడి త్రిష ఆనందం వ్యక్తం చేశారు. ఇవాళ హైదరాబాద్ చేరుకున్న ఆమె మీడియాతో మాట్లాడారు. 'గతేడాది టోర్నీలో నాకు ఎక్కువగా అవకాశం రాలేదు. ఈసారి ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ముందే అనుకున్నా. దానికి అనుగుణంగానే కష్టపడ్డా. మలేసియాలోని పిచ్‌లకు తగినట్లుగా ముందు నుంచే సాధన చేశాం. అందువల్ల సులభంగా గెలవగలిగాం. అమ్మానాన్నలు, కోచ్, టీమ్ సభ్యుల సహకారంతో ఉత్తమ ప్రదర్శన ఇవ్వగలిగా' అని త్రిష అన్నారు.




# నిమిషాల్లోనే అమ్ముడైన టీమ్ఇండియా మ్యాచ్‌ల టికెట్లు

**ముంబయి:** ప్రతిష్ఠాత్మక ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి సమయం దగ్గర పడుతోంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని దేశాలు తమ జట్లను ప్రకటించాయి. ఫిబ్రవరి 11 వరకు టీమ్‌లలో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఛాన్స్ ఇచ్చారు. మరోవైపు, ఈ టోర్నీలో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోనే జరగనున్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్, 23న పాకిస్థాన్, మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. భారత్ ముందంజ వేస్తే తొలి సెమీఫైనల్ కూడా దుబాయ్‌లోనే జరుగుతుంది. ఈక్రమంలో భారత్ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లను సోమవారం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. సాధారణ స్టాండ్ టికెట్ల ప్రారంభ ధర యూఏఈ దిర్హమ్‌లు 125 (సుమారు రూ.2,965)గా నిర్ణయించారు. టీమ్ఇండియా ఆడే మ్యాచ్‌ల టికెట్లన్నీ హాట్‌కేకుల్లా నిమిషాల్లోనే అమ్ముడుపోయాయి. టికెట్స్ దక్కించుకున్నవారు ఆనందం వ్యక్తంచేయగా.. దక్కనివారు నిరాశ చెందారు.

**భారత్, పాక్ మ్యాచ్.. టికెట్లు గంటలోనే**

భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రెట్టింపు ధర చెల్లించైనా టికెట్లు దక్కించుకోవడానికి అభిమానులు ఏమాత్రం వెనకాడరు. ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి మెగా టోర్నీలో మ్యాచ్ అంటే టికెట్ల డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దుబాయ్ స్పోర్ట్స్ సిటీ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 25,000 కాగా.. భారత్, పాక్ మ్యాచ్ టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో సుమారు 1,50,000 మంది పోటీపడినట్లు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తుండగా.. భద్రతా కారణాలరీత్యా పాక్ వెళ్లడానికి టీమ్ఇండియా నిరాకరించింది. దీంతో టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నారు. భారత్ ఆడే లీగ్ మ్యాచ్‌లతోపాటు సెమీ ఫైనల్, ఫైనల్ (క్వాలిఫై అయితే) దుబాయ్‌లోనే నిర్వహిస్తారు. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.

# ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్.. 'అభిషేక్ శర్మ సక్సెస్ సీక్రెట్ ఇదే'

**ముంబయి:** అభిషేక్ శర్మ .. ప్రస్తుతం భారత క్రికెట్‌లో ఈ పేరు మార్మోగుతోంది. ఈ యువ బ్యాటర్ ఇంగ్లాండ్‌తో జరిగిన ఐదో టీ20లో సంచలన ఇన్నింగ్స్ ఆడటమే ఇందుక్కారణం. 37 బంతుల్లోనే సెంచరీ సాధించిన ఈ కుర్రాడు ఏకంగా 13 సిక్సర్లు బాదేశాడు. ఓవైపు విధ్వంసం సృష్టిస్తూనే.. మరోవైపు వికెట్‌కు విలువనిస్తూ, 18వ ఓవర్ వరకు క్రీజులో నిలిచి జట్టుకు భారీ స్కోరు సాధించిపెట్టాడు. ఈ యువ ఆటగాడి విజయం వెనక అతడి మెంటార్, భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ది కీలకపాత్ర. ఇంగ్లాండ్‌తో సిరీస్ ప్రారంభానికి ముందు కూడా అభిషేక్‌తో యువీ మాట్లాడాడు. ఐదు రోజులపాటు అతడితోనే ఉండి శిక్షణ ఇచ్చాడు. ఈ విషయాన్ని అభిషేక్ తండ్రి రాజ్‌కుమార్ శర్మ వెల్లడించారు. ''యువరాజ్ ఇంగ్లాండ్ సిరీస్‌కి ముందు అభిషేక్‌తో మాట్లాడాడు. అభిషేక్‌కు ఐదు రోజుల ఖాళీ సమయం దొరకడంతో అమృత్‌సర్ చేరుకున్నాడు. అదే రోజు యువరాజ్ అతనికి ఫోన్ చేసి గురుగ్రామ్‌కు రమ్మని చెప్పాడు. యువరాజ్ ఐదు రోజులపాటు అభిషేక్‌తోనే ఉండి శిక్షణ ఇచ్చాడు. అతణ్ని మానసికంగా సిద్ధం చేసి ఆలోచనా విధానాన్ని మార్చాడు. సుదీర్ఘ ఇన్నింగ్స్ ఎలా ఆడాలి, ఇన్నింగ్స్‌ను ఎలా నిర్మించాలో యువరాజ్‌ని అభిషేక్ అడిగి తెలుసుకున్నాడు. బ్యాటింగ్‌తోపాటు బౌలింగ్‌లో శిక్షణ పొందాడు. యువీ బృందం మొత్తం అభిషేక్‌పై దృష్టిసారించింది. కొందరు జిమ్, మరికొందరు రన్నింగ్ ఇతర కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. భారత మాజీ బ్యాటర్ శిఖర్ ధావన్ కూడా అభిషేక్‌తో ఐదారు రోజులు ఉండి మెలకువలు నేర్పించాడు. తన అనుభవాలను అతడితో పంచుకున్నాడు. భారత పరిస్థితుల్లో ఆడుతున్నప్పుడు బ్యాటింగ్ ఏ విధంగా ఉండాలో చెప్పాడు. అభిషేక్ చాలా అదృష్టవంతుడు. వివిధ సందర్భాల్లో రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, బ్రియాన్ లారా వంటి దిగ్గజ క్రికెటర్ల వద్ద శిక్షణ పొందాడు. అభిషేక్‌తో లారా రోజూ మాట్లాడతాడు. ఏ పరిస్థితుల్లో ఎలా ఆడాలి, సుదీర్ఘ ఇన్నింగ్స్ ఎలా నిర్మించాలనే విషయాలను చెబుతుంటాడు' అని అభిషేక్ తండ్రి రాజ్‌కుమార్ తెలిపారు.




# భారత్‌లో ఐపీబీఎల్.. ఆరు నగరాల్లో పోటీలు




**హైదరాబాద్, ఆట ప్రతినిధి :** భారత బాక్సింగ్ అభిమానులకు శుభవార్త! ప్రముఖ బాక్సింగ్ లీగ్‌గా పేరొందిన అంథోనీ పెట్టిస్ ఫైటింగ్ చాంపియన్‌షిప్(ఏపీఎఫ్‌సీ).. భారత్‌కు చెందిన ఇండియన్ ప్రొ బాక్సింగ్ లీగ్(ఐపీబీఎల్) భారత్‌లో తొలిసారి బాక్సింగ్ పోటీలు నిర్వహించబోతున్నాయి. వచ్చే నెలలో దేశంలోని ఆరు ప్రధాన నగరాలు ఢిల్లీ, హైదరాబాద్, జైపూర్, ముంబై, గోవా, బెంగళూరు వేదికలుగా మ్యాచ్‌లు నిర్వహిస్తున్నాయి.ఇందుకోసం యూఎఫ్‌సీ లైట్‌వెయిట్ మాజీ చాంపియన్ అంథోనీ పెట్టిస్ తొలిసారి భారత్‌కు రాబోతున్నాడు. డబ్ల్యూబీసీ ఇండియా చాంపియన్ సబరి జైశంకర్, సెర్గియో పెట్టిస్ మధ్య ప్రధాన పోరు జరుగుతుందని ఐపీబీఎల్ సోమవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే పలు ప్రపంచ బాక్సింగ్ కౌన్సిల్(డబ్ల్యూబీసీ) టైటిళ్లు సొంతం చేసుకున్న సబరి, సెర్గియో మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది.

# సచిన్, కోహ్లీ కాదు.. అతడే గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ క్రికెటర్: రికీ పాంటింగ్



**సిడ్నీ:** ప్రపంచంలో అత్యుత్తమ క్రికెటర్ ఎవరు? అని అడిగితే చాలామంది సచిన్ తెందూల్కర్, ముత్తయ్య మురళీధరన్, వివి రిచర్డ్స్, గ్యారీ సోబర్స్, విరాట్ కోహ్లీ వంటి దిగ్గజ ఆటగాళ్ల పేర్లు చెబుతారు. లేకపోతే తమ దేశానికి ప్రాతినిధ్యం వహించిన గొప్ప ఆటగాళ్లను అత్యుత్తమ క్రికెటర్‌గా భావిస్తారు. కానీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పైన పేర్కొన్న వారెవరి పేర్లను బెస్ట్ ప్లేయర్‌గా పరిగణించలేదు. అలా అని ఆసీస్ మాజీ క్రికెటర్ అలెన్ బోర్డర్, డాన్ బ్రాడ్‌మన్ పేర్లు చెప్పలేదు. ఇంతకీ పాంటింగ్ ఎవరి పేరు చెప్పాడో తెలుసా దక్షిణాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వెస్ కలిస్. 'జాక్వెస్ కలిస్ అత్యుత్తమ క్రికెటర్. మిగతా వారందరి సంగతి నాకు తెలియదు. నా వరకు అతనే గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ క్రికెటర్. టెస్టుల్లో 13,000 పరుగులు, 45 సెంచరీలు, 300 వికెట్లు. మిగతా వారు తమ కెరీర్‌లో బ్యాటింగ్‌లో లేదా బౌలింగ్ అత్యుత్తమ గణాంకాలను కలిగి ఉండవచ్చు. కలిస్ మాత్రం ఈ రెండింటిని కలిగి ఉన్నాడు. స్లిప్స్‌లో అతను అసాధారణ ఫీల్డర్. అతనికి తగినంత గుర్తింపు దక్కలేదు. ఎందుకంటే కలిస్ ఎక్కువగా మాట్లాడడు. అది అతని వ్యక్తిత్వం. అతడిని మీడియా ఎప్పుడూ హైలైట్ చేయలేదు' అని పాంటింగ్ వివరించాడు.

కలిస్ తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో టెస్టులు, వన్డేల్లో ఎన్నో రికార్డులు సాధించాడు. 166 టెస్టులు ఆడిన ఈ దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ 13,289 పరుగులు చేశాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో కలిస్‌ది మూడో స్థానం. సచిన్ (15,921 పరుగులు), పాంటింగ్ (13,378 పరుగులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. వన్డేల్లోనూ కలిస్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. 328 మ్యాచ్‌ల్లో ఆడి 11,579 రన్స్ సాధించాడు.519 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 338 క్యాచ్‌లు అందుకున్నాడు.

# అమెరికా-చైనా ట్రేడ్ వార్.. భారత్‌కు లాభమే!



ఢిల్లీ: అమెరికా, చైనాలు దిగుమతులపై పరస్పరం సుంకాల విధింపుతో వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతున్నాయి. ఈ చర్యల వల్ల ఆయా దేశాల్లో కొన్ని వస్తువుల ధరలు గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో అమెరికాకు ఎగుమతులు పెంచడం ద్వారా భారత ఎగుమతిదారులు ప్రయోజనం పొందవచ్చని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ట్రంప్‌తొలి హయాంలో చైనాపై సుంకాలు విధించినప్పుడు ప్రధానంగా లాభపడిన నాలుగు దేశాల్లో భారత్ ఒకటని గుర్తు చేస్తున్నాయి. ''ధరల పెరుగుదల వల్ల అమెరికా కొనుగోలుదారులు ప్రత్యామ్నాయం వైపు చూస్తారు. ఈ పరిణామాలు భారత్ ఎగుమతులకు మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చు. విద్యుత్ యంత్రాలు, ఆటో పరికరాలు, మొబైల్, ఫార్మా, రసాయనాలు, దుస్తులు, వస్త్ర రంగాలు లాభపడవచ్చు'' అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ వెల్లడించారు. అయితే, భారత ఉత్పత్తి సామర్థ్యం, పోటీతత్వంపై ఈ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయన్నారు. రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగానే పలు దేశాల నుంచి దిగుమతులపై సుంకాలు పెంచే ఆదేశాలపై సంతకం చేశారు. చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై కస్టమ్స్ సుంకాలు విధించారు. దీంతో అమెరికా మార్కెట్లో వాటి ధరలు పెరగడం, పోటీ తగ్గడం వల్ల చైనా ఎగుమతులపై ప్రభావం పడే అవకాశం ఉందని ఎగుమతిదారులు చెబుతున్నారు. అమెరికా వినియోగదారులపైనా ధరల పెరుగుదల ప్రభావం పడవచ్చనే ఆందోళనలు మొదలయ్యాయి. ఈ పరిణామాలు భారత్ నుంచి ఎగుమతి అవకాశాలను మరింత పెంచేందుకు దోహదం చేయవచ్చని భారత వాణిజ్య నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భారీ లాభాల్లో సూచీలు.. 23,700 పైకి నిఫ్టీ

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలు రాణించాయి. కెనడా, మెక్సికో దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. వాణిజ్య యుద్ధ భయాలు రేపిన ట్రంప్ నుంచి సానుకూల నిర్ణయం వెలువడడంతో ఆసియాతో పాటు మన మార్కెట్ సూచీల భారీ లాభాలకు కారణమైంది. ఈ క్రమంలో సెన్సెక్స్ ఓ దశలో 1400 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 23,750 మార్కును అందుకుంది.సెన్సెక్స్ ఉదయం 77,687.60 పాయింట్ల (క్రితం ముగింపు 77,186.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో దాదాపు 1450 పాయింట్లు లాభపడి 78,658.59 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1226.94 పాయింట్ల లాభంతో 78,413.68 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 378.20 పాయింట్ల లాభంతో 23,739.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.07గా కొనసాగుతోంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.5.5 లక్షల కోట్లు పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది.



సెన్సెక్స్ 30 సూచీలో ఎల్అండ్‌టీ, ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, రిలయన్స్ ప్రధానంగా లాభపడగా.. ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతీ నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 75.13 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2847 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**

- మెక్సికో, కెనడాపై సుంకాల విషయంలో ట్రంప్ తన నిర్ణయాన్ని వాయిదా వేయడం సూచీల లాభాలకు కారణమైంది. దీంతో ఆసియా మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభపడ్డాయి.
- రేట్ల కోతపై ఆర్‌బీఐ నుంచి సానుకూల సంకేతం వస్తుందన్న అంచనాలతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కూడా సూచీల ర్యాలీకి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.
- జనవరిలో కార్ల విక్రయాలు స్థిరమైన వృద్ధిని నమోదు చేయడంతో ముున్ముందు ఆటోమొబైల్ రంగానికి డిమాండ్ ఉంటుందన్న అంచనాలతో ఆయా కంపెనీల షేర్లు రాణించాయి.
- ఇటీవల మార్కెట్ పతనాన్ని మదుపర్లు అవకాశంగా తీసుకుని కొనుగోళ్లకు దిగడం కూడా మరో కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. జీవనకాల గరిష్ఠాల నుంచి నిఫ్టీ 50 ఇప్పటి వరకు దాదాపు 11 శాతం పతనమైంది. దీనికితోడు కొన్ని లార్జ్ క్యాప్ షేర్ల ధరలు ఆకర్షణీయంగా ఉండడం మదుపర్లు కొనుగోళ్లకు దిగుతున్నట్లు విశ్లేషిస్తున్నారు.

# పాత పన్ను విధానం రద్దు ఆలోచన లేదు: నిర్మలా సీతారామన్

**ఢిల్లీ:** కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో పాత పన్ను విధానాన్ని రద్దు చేస్తారన్న ప్రచారం మరోసారి ఊపందుకుంది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. పాత పన్ను విధానం రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇండియాటుడే- బిజినెస్‌టుడే నిర్వహించిన 2025 రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు.''పన్ను చెల్లింపుదారులందరూ కొత్త పన్ను విధానంలోకి మారాలని మీరు భావిస్తున్నారా?'' అంటూ ఎదురైన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పాత పన్ను విధానం రద్దు చేయాలన్న ప్రతిపాదన తమ వద్ద లేదన్నారు. పన్ను ఫైలింగ్ విధానం సరళంగా ఉండాలనే ఉద్దేశంతో కొత్త పన్ను విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగా తీసుకురాబోయే ఆదాయపు పన్ను చట్టం గురించి కూడా ప్రస్తావన వచ్చింది. 1961లో తీసుకొచ్చిన పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో అనేక మార్పులు, చేర్పులతో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.





# భారీ బడ్జెట్ కారణంగానే తెరకెక్కించలేకపోతున్నా

## ‘క్రిష్4’పై దర్శకుడు కామెంట్స్

హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కిన ‘క్రిష్’ సిరీస్ సినిమాలు మంచి ప్రేక్షకాదరణతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించాయి. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలు భారీ విజయాన్ని అందుకోగా నాలుగో భాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే దీని ఆలస్యానికి కారణాన్ని తాజాగా దర్శకుడు రాకేష్ రోషన్ వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ చిత్రాన్ని 12 ఏళ్ల నుంచి తెరకెక్కించలేకపోతున్నట్లు చెప్పారు. ‘‘క్రిష్ 4’ కోసం ప్రేక్షకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. కానీ, మేము ఎంత ప్రయత్నించినా బడ్జెట్ సమకూరడం లేదు. అందుకే ఇది ఆలస్యమవుతోంది. నాలుగో భాగాన్ని మరింత గ్రాండ్‌గా తీయాలి. ఒకవేళ నేను బడ్జెట్ తగ్గించాలని చూస్తే.. ఈ చిత్రం ఓ సాధారణ కథలా అయిపోతుంది. అంతేకాదు.. ప్రస్తుతం ప్రపంచం చాలా చిన్నదిగా మారిపోయింది. అరచేతిలో ఉండే సెల్‌ఫోన్‌లో మొత్తం తెలిసిపోతోంది. ఈ రోజుల్లో పిల్లలు కూడా ఎంతోమంది సూపర్‌హీరోల చిత్రాలను చూస్తున్నారు. అలాంటప్పుడు మనం చిన్న తప్పు చేసినా వారి నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే మరింత జాగ్రత్తగా దీన్ని తీయాలి. హాలీవుడ్‌లో సూపర్ హీరో డ్రామాలు భారీ బడ్జెట్‌తో రూపొందిస్తారు. అది మనకు సాధ్యం కాదు. అంత ఖర్చులు భరించలేం. వారు రూ.1000తో సినిమా తీస్తే.. మనం అదే సినిమాను రూ.4కు తీయాలి. నిర్మాతలు బడ్జెట్‌పై కాకుండా మంచి కథలపై దృష్టి పెట్టాలి’’ అని దర్శకుడు రాకేష్ రోషన్ చెప్పారు. ఇక క్రిష్ సిరీస్ చిత్రాలు వరుసగా 2003, 2006, 2013 సంవత్సరాల్లో విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాకేష్ రోషన్ ‘ది రోషన్స్’ డాక్యుమెంటరీ ప్రచారంలో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కుటుంబాన్ని ఆధారంగా చేసుకొని దీన్ని రూపొందించారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది స్ట్రీమింగ్ అవుతోంది. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు రోషన్ కుటుంబం చేసిన సేవలు, ఆ కుటుంబంలోని మూడుతరాల వారిని ఈ డాక్యుమెంటరీలో చూపించారు.





# ‘టాక్సిక్’లోకి తొలి అడుగులు

కథానాయకుడు యశ్.. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ కాంబోలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’ . కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కియారా అద్వాణీ కథానాయిక. నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలిసింది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా బెంగళూరులో నాలుగో షెడ్యూల్‌ను ప్రారంభించుకున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌తోనే నయనతార , హ్యూమా ఖురేషి, తారా సుతారియా ఈ చిత్ర సెట్‌లోకి తొలి అడుగులు వేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మొత్తం ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇక మరోవైపు హ్యూమా ఖురేషి తన కొత్త పుస్తకం జెబా కాపీల్ని ‘టాక్సిక్..’ ప్రధాన తారాగణానికి బహుమతిగా ఇచ్చినట్లు తెలుస్తోంది. నయన్ ఇప్పటికే హ్యూమా కొత్త పుస్తక కాపీని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి రవి బస్రూర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# తండేల్‌కు నాగచైతన్య, సాయిపల్లవి టాప్ రెమ్యునరేషన్స్..



టాలీవుడ్ యాక్టర్ నాగచైతన్య హీరోగా నటిస్తోన్న చిత్రం తండేల్ . సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. చందూమొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ మూవీని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సాయిపల్లవి, నాగచైతన్య తీసుకుంటున్న రెమ్యునరేషన్లకు సంబంధించి ఆసక్తికర వార్త బయటకు వచ్చింది.తాజా టాక్ ప్రకారం తండేల్ చిత్రానికి నాగచైతన్య రూ.15 కోట్లు తీసుకుంటుండగా.. సాయి పల్లవి రూ.5 కోట్లు తీసుకుంటున్నట్టు ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. ఇక చైతూ కెరీర్‌లోనే ఈ చిత్రానికి టాప్ రెమ్యునరేషన్ తీసుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. మరోవైపు సాయిపల్లవి తీసుకుంటున్న రెమ్యునరేషన్ కూడా ఆమె కెరీర్‌లోనే టాప్ కావడం విశేషం. .ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. తండేల్‌లో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయి సత్య పాత్రలో కనిపించనుంది. సాయిపల్లవి పాత్ర ప్రేక్షకులకు చిరస్థాయిగా గుర్తుండిపోతుందని ఇప్పటివరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, ట్రైలర్ చెబుతున్నాయి. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది.


# ప్రభాస్ ఫౌజీ లాంగ్ షెడ్యూల్ ప్లాన్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ అభిమానులకు ఊపిరాడకుండా చేసేందుకు బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వీటిలో హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ‘ఫౌజీ`ఒకటి. ఇమాన్వీ ప్రభాస్‌కు జోడీగా నటిస్తోంది.తాజా సమాచారం ప్రకారం ఫౌజీ నెక్స్ట్ షెడ్యూల్ రేపు హైదరాబాద్‌లో షురూ కానుంది. రేపటి నుంచి సుమారు రెండు నెలల పాటు సినిమా షూటింగ్ కొనసాగనుందని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.హను రాఘవపూడి టీం ప్రత్యేకంగా నిర్మించిన సెట్స్‌లో లీడ్ యాక్టర్లపై వచ్చే కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారట. సీతారామం, రాధేశ్యామ్ లైన్‌లో వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫౌజీ సాగనుందని ఇప్పటికే వార్తలు వస్తుండగా.. ఈ చిత్రంలో ప్రభాస్ సైనికుడి పాత్ర పోషిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రభాస్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ 2 చేస్తున్నాడని తెలిసిందే. దీంతోపాటు సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో స్పిరిట్, మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ సినిమాలు కూడా చేస్తున్నాడు.స్పిరిట్ కాప్ డ్రామా నేపథ్యంలో ఉండబోతుందని ఇప్పటికే టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్ వెల్లడించాడు. ఈ చిత్రంలో పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ విలన్‌గా నటిస్తున్నాడు. దయాదాక్షిణ్యాలు లేని పోలీసాఫీసర్‌కు.. గ్లోబల్ క్రైమ్ సిండికేట్‌కు మధ్య జరిగే పోరు నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుంది. మరోవైపు ఈ చిత్రాన్ని భద్రకాళీ పిక్చర్స్‌పై సందీప్‌రెడ్డి వంగాతో కలిసి టి సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ నిర్మిస్తున్నారు.



# ఓటీటీలోకి ‘గేమ్ ఛేంజర్’.. అధికారికంగా ప్రకటించిన సంస్థ

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘గేమ్ ఛేంజర్’. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వేదికగా ఫిబ్రవరి 7 నుంచి అందుబాటులోకి రానుంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఇది స్ట్రీమింగ్ కానుంది . రామ్‌చరణ్ సరసన కియారా అద్వాణీ నటించిన ఈ చిత్రంలో పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భారీ వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి.కథేంటంటే: రామ్‌నందన్ (రామ్‌చరణ్) ఓ యువ ఐపీఎస్ అధికారి. కాలేజీలో తను ప్రేమించిన దీపిక (కియారా అద్వాణీ) కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకుంటాడు. తనలో కోపాన్ని తగ్గించుకుంటాడు. ఆమె కోసమే ఐపీఎస్ నుంచి ఐఏఎస్ అవుతాడు. విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోగానే మినిస్టర్ బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య), అతని గ్యాంగ్‌తో యుద్ధం మొదలవుతుంది. అభ్యుదయ పార్టీకి చెందిన మోపిదేవి తండ్రే ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్). పదవుల కోసం ఆరాటపడే మోపిదేవి ముఖ్యమంత్రి పదవి కోసం ఎలాంటి ఎత్తులు వేశాడు? అడ్డొచ్చిన ఐఏఎస్ అధికారి రామ్‌నందన్‌ని అధికార బలంతో ఏం చేశాడు? సమర్థుడైన రామ్‌నందన్.. మోపిదేవికి ఎలాంటి బదులిచ్చాడు? అభ్యుదయ పార్టీ, అప్పన్న (రామ్‌చరణ్), పార్వతి (అంజలి)తో రామ్‌నందన్‌కి ఉన్న సంబంధమేమిటన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!.



# ‘అల.. వైకుంఠపురములో’ తమిళ సినిమా అంటూ నోరు జారిన పూజా హెగ్డే

షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం దేవా. ఈ సినిమాలో కథానాయికగా పూజా హెగ్డే నటించగా.. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రోస్ దర్శకత్వం వహించాడు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పూజా మాట్లాడుతూ.. అలా వైకుంఠపురములో తమిళ సినిమా అని ఇది పాన్ ఇండియా లెవల్‌లో రీచ్ అయ్యిందని తెలిపింది.అలాగే దువ్వడా జగన్నాథం(డీజే) కూడా నార్త్‌లో కూడా సూపర్ హిట్ అయ్యిందని చెప్పుకొచ్చింది. అయితే ఈ వ్యాఖ్యలు విన్న అల్లు అర్జున్ అభిమానులతో పాటు తెలుగు మూవీ లవర్స్ పూజా ట్రోల్ చేస్తున్నారు. నువ్వు నటించిన సినిమా.. నీకు సూపర్ హిట్ ఇచ్చిన కూడా ఏ భాష అనేది తెలియాకుండా ఎలా ఉన్నావు అంటూ కామెంట్లు పెడుతున్నారు.ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా వచ్చిన చిత్రం అలా వైకుంఠపురములో. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించింది. లాక్ డౌన్ ముందు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.250 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి సూపర్ హిట్‌గా నిలిచింది.



# 90 శాతం ఆరోగ్య సమస్యలకు పరిష్కారం ఇచ్చే డీటాక్స్ ఫుడ్స్!

శరీరాన్ని డీటాక్స్ చేయడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. దీనికోసం సరైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, అప్పుడప్పుడు ఉపవాసం చేయడం, ఆకుపచ్చ కూరగాయలు, గ్రీన్ టీ, బ్లాక్ టీ వంటివి తీసుకోవడం మంచిది. ఇవి హానికరమైన టాక్సిన్స్ ని బయటకు పంపి, జీర్ణక్రియను మెరుగుపరిచి శక్తిని పెంచుతాయి. డీటాక్స్ చేయడం అంటే శరీరాన్ని శుభ్రపరచడం, విశ్రాంతినివ్వడం. మనం శరీరాన్ని బయటి నుండి మాత్రమే కాకుండా లోపల నుండి కూడా శుద్ధి చేయాలి. డీటాక్స్ చేయడం వల్ల వ్యాధుల ప్రమాదం తగ్గడంతో పాటు రక్తం శుద్ధి అవుతుంది. మలినాలు కూడా తొలగిపోతాయి. నీరసం, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, తలనొప్పి, కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు ఉన్నప్పుడు శరీరాన్ని డీటాక్స్ చేయడం చాలా అవసరం.

**పోషకాహారం**

శరీరానికి పోషకాహారం చాలా ముఖ్యం. పోషకాహారం తీసుకుంటే శరీరం సహజంగానే డీటాక్స్ అవుతుంది. సేంద్రీయ, సహజ పద్ధతుల్లో పండించిన ఆహారం తీసుకోవాలి. నూనె, కారం, మసాలాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తగ్గించాలి. సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరం సహజంగా శుద్ధి అవుతుంది.

**నీరు**

శరీరాన్ని సహజంగా డీటాక్స్ చేయాలనుకుంటే రోజుకి తగినంత నీరు తాగాలి. నీరు ఎక్కువగా తాగితే బాడీలోని టాక్సిన్స్ మూత్ర రూపంలో బయటికి వెళ్తాయి. రోజుకి 5 నుండి 6 లీటర్ల నీరు తాగడం వల్ల బాడీలో పేరుకుపోయిన మలినాలు బయటికి వచ్చి శరీరం శుభ్రపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది సహాయపడుతుంది.

**ఉపవాసం**

మనం ప్రతిరోజు ఏదో ఒకటి తింటూ ఉంటాం. దీనివలన బాడీలో టాక్సిన్స్ పేరుకుపోతాయి. కాబట్టి బాడీ డీటాక్స్ అవ్వడానికి అప్పుడప్పుడు ఉపవాసం కూడా చేయాలి. ఒకటి రెండు రోజులు హెవీ మీల్స్ బదులు తేలికైన ఫుడ్ తీసుకోండి. ఈ సమయంలో పండ్లు, కూరగాయలు తినొచ్చు. దీనివలన రోజంతా తేలిగ్గా ఉండటమే కాకుండా కడుపు, జీర్ణ వ్యవస్థకి విశ్రాంతి ఇచ్చినట్టు అవుతుంది.

**ఆకుపచ్చ కూరగాయలు**

ఆకుపచ్చ కూరగాయలు తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో బాడీ డీటాక్సిఫికేషన్ ఒకటి. ఆకుపచ్చ కూరగాయల్ని స్మూతీస్, సలాడ్స్ రూపంలో తీసుకోవచ్చు. బచ్చలికూర, పాలకూర, దోసకాయ వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవచ్చు. వీటితో పాటు క్యారెట్, బీట్‌రూట్ మొదలైనవి కూడా తీసుకోవచ్చు. వీటిలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి బాడీకి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలని అందిస్తాయి.

**హెర్బల్ డ్రింక్స్**

హెర్బల్ డ్రింక్స్ కూడా ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని తీసుకోవడం వల్ల బాడీ డీటాక్స్ అవుతుంది. బాడీలోని టాక్సిన్స్ బయటికి వెళ్లిపోతాయి. బాడీ డీటాక్స్ అవ్వటానికి గ్రీన్ టీ, హెర్బల్ టీ మొదలైనవి తీసుకోవచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. బాడీ డీటాక్స్ అవ్వటానికి బ్లాక్ టీ కూడా చాలా మంచిది. మీరు ఈ టీలలో ఏదైనా ఒకటి రోజూ తీసుకోవడం మంచిది. ఒక్కొక్కటైనా తీసుకోవచ్చు. రోజూ రెండు కప్పుల టీ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
“విశ్వంభర” తెలుగు దిన పత్రిక
VISHVAMBHARA TV
ప్రముఖ టీవీ ఛానల్స్, తెలుగు దినపత్రికల్లో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, కెమెరామెన్స్,
PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com

